V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
23-07-2024

సంపుటి : 01 | సంచిక : 80 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం
- తొలిసారి ప్రతిపక్ష నేతగా కేసీఆర్ హాజరు
- 25న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న సర్కార్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరుకాబోతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో తొలిసారి అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాబోతున్నట్లు తెలుస్తోంది. **మిగతా2లో...**

## పనులున్నాయ్.. పైసల్ గావాలె!

**ఢిల్లీలో కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి వినతులు**



**విశ్వంభర, ఢిల్లీ:**
తెలంగాణలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులను అభ్యర్థించారు. అసెంబ్లీలో మంగళవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కీలక ప్రాజెక్టులను సాధించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన చేపట్టారు. సోమవారం వరుసగా కేంద్రమంత్రులతో భేటీ అయిన ఆయన పలు అంశాలపై వినతులు అందించారు. మూసీ ప్రక్షాళనకు రూ. 4 వేల కోట్లు ఇవ్వాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. గోదావరి జలాలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల్లో నింపే పనులకు రూ.6వేల కోట్లు సాయం చేయాలని కోరారు. 7 లక్షల 85వేల ఇళ్లకు నల్లా కలెక్షన్లు లేవన్న సీఎం, జల్‌జీవన్ మిషన్ నిధులు కింద రూ.16,100 కోట్లు మంజూరు చేయాలని మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. అంతకుముందు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల **మిగతా2లో...**




# ఈ పొద్దు.. కేంద్ర పద్దు

## అంచనాలు నిజమయ్యేనా? ఆశలు నెరవేరేనా?

పన్ను రాయితీలో ఉపశమనం దక్కేనా?

వికసిత్ భారతే లక్ష్యం..

అభివృద్ధితో పాటు సంక్షేమానికీ పెద్దపీట

నేడు ఉదయం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**విశ్వంభర, ఢిల్లీ:**
అందరి కళ్లూ ఆమెపైనే ఉన్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆశలు నెరవేరుస్తారో లేక అంకెల గారడీ చేస్తారో అని యావద్దేశం ఎదురుచూస్తోంది. స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని భారత్ ఆకాంక్షిస్తోంది. దానిని సాకారం చేసుకునేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను కేంద్రప్రభుత్వం సిద్ధం చేస్తోంది. మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 202425 పూర్తిస్థాయి బడ్జెట్‌లో దానిని ఆవిష్కరించే **మిగతా3లో...**

### ఆరేళ్లలో 78.5 లక్షల ఉద్యోగాలు

- వ్యవసాయేతర రంగంలో కల్పించాలి
- ఆర్థిక సర్వే -2024 దిశానిర్దేశం

2

### పార్లమెంట్ వేదికగా రాజకీయాలా?



- ప్రజా బలంతో ఎన్నికైన ప్రభుత్వం గొంతునొక్కుతారా?
- విపక్షాలపై మండిపడిన ప్రధాని మోదీ
- అయిదేళ్ల ప్రయాణానికి బడ్జెట్ మార్గం చూపుతుందని వ్యాఖ్య

2

ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు

## పాల్గొనే వీలు

- 58 ఏళ్ల తర్వాత నిషేధాన్ని ఎత్తివేసిన మోదీ
- దశాబ్దాల నాటి బ్యాన్ ఎత్తివేతపై కాంగ్రెస్ ఫైర్
- కేంద్రం నిర్ణయాన్ని స్వాగతించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



9

కల్తీ పేరుతో కల్లు మండువాలను

## మూసేస్తే సహించం

- నాగర్ కర్నూల్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ
- హాజరైన మంత్రి జూపల్లి, మధుయాష్కి గౌడ్, స్వామి గౌడ్ , శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, వంశీకృష్ణ



2



3

ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో భారీ అగ్నిప్రమాదం..

**ధ్వంసమైన యుద్ధ నౌక, అధికారి గల్లంతు**

రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్‌ను

## అభివృద్ధి చేసుకుందాం

- డ్రగ్స్ ఫ్రీ సిటీ గా రాజధాని
- డెంగ్యూ కేసులు రాకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలి..
- భాగ్యనగరం బ్రాండ్ ఇమేజ్ పెంచేలా చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగర ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా శాసన సభ బడ్జెట్ **మిగతా2లో...**

రుణమాఫీ ఏ ప్రాతిపదికన ఇస్తున్నారో

## అర్థం కావడం లేదు

- పంచాయతీ ఎన్నికలు కాకపోవడంతో కేంద్రం 750 కోట్లు నిధులు ఆపింది
- చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది
- అసెంబ్లీలో అవకాశం వస్తే అన్ని అంశాలపై ప్రభుత్వం దుమ్ము దులుపుతా
- మాజీ మంత్రి హరీశ్ రావు



2

ఆమె ఫిజికల్‌గానే ఫిట్..

## మెంటల్‌గా కాదు

- స్మితా సబర్వాల్ పై సంచలన వ్యాఖ్యలు..!
- సీఎం రేవంత్ సహా కేసీఆర్, కేటీఆర్ తక్షణమే స్పందించాలి : మాజీ బ్యూరోక్రాట్ బాలలత

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్ ట్వీట్ ఇప్పుడు మరో వివాదం లేపింది. ఆమె చేసిన వ్యాఖ్యలపై మాజీ బ్యూరో క్రాట్ మండిపడ్డారు. స్మిత జస్ట్ ఒక ఐఏఎస్ అధికారి మాత్రమే అన్నారు. **మిగతా2లో...**




మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 112 | ₹ 134 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 194 | ₹ 221 |



బొగత పరవళ్లు...

### జనత మది జల్లు

తెలంగాణ నయాగరాగా గుర్తింపు పొందిన బొగత జలపాతం ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఉప్పొంగుతోంది. జలకళతో తొణికిసలాడుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో బొగత పరవళ్ళు తొక్కుతోంది. బొగత జలపాతం అందాలను, అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని చూడడానికి చాలామంది పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఇప్పటికే బొగత జలపాతం వద్ద అత్యంత ప్రమాదకరంగా వరద ప్రవాహం కొనసాగుతుండడంతో సందర్శకులను జలపాతం లోకి దిగడానికి అనుమతి లేకుండా, కేవలం చూడడానికి మాత్రమే అనుమతిస్తున్నారు. తాజాగా మరింత ఉద్ధృతి పెరగడంతో, పర్యాటకులు వస్తే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని అనుమానిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. **- విశ్వంభర, ఖమ్మం**

ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా

## చర్యలు చేపట్టాలి

### మరో మూడు రోజుల పాటు వర్షాలు

- ముఖ్యమంత్రి నిరంతరం సమీక్షిస్తున్నారు
- కలెక్టర్లను అప్రమత్తం చేసిన సీఎస్ శాంతి కుమారి
- భద్రాచలం వద్ద ఇప్పటికే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ



**విశ్వంభర,హైదరాబాద్:** రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించినందున అన్ని జిల్లాల **మిగతా2లో...**



## కల్తీ పేరుతో కల్లు మండువాలను మూసేస్తే సహించం: మధుయష్కీ గౌడ్

**విశ్వంభర, నాగర్ కర్నూల్:** కల్తీ పేరుతో కల్లు మండువ లపై దాడులు చేసి, అక్రమ కేసులు బనాయిస్తే సహించేది లేదని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కిగౌడ్ పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ లో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. మంత్రి జూపల్లి కృష్ణారావు , శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ , మాజీమంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ , ఎమ్మెల్యే లు కుచుకుల్ల రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, తదితరులతో కలిసి మధుయాష్కి గౌడ్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ... గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో కల్లు మండువాలు మూసేస్తే.. అధికార పార్టీలో ఎంపీగా ఉండి కూడా ఎదిరించి పోరాడని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా కల్తీ పేరుతో దాడులు చేసి గౌడ కులస్తులను ఇబ్బంది పెడితే అండగా నిలబడి పోరాడుతానని పేర్కొన్నారు. తాటి చెట్టు నుంచి కిందపడి ఎంతోమంది మరణించడం అంగవైకల్యానికి గురి కావడం బాధిస్తుందన్నారు. గీత కార్మికుల రక్షణ కోసం ఇటీవల తమ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 'కాటమయ్య రక్షణ కవచం' పేరుతో సేఫ్టీ కిట్స్ ను అందజేసిందన్నారు. గీత కార్మికులు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. 350 ఏళ్ల కిందటనే సమాజంలో జరుగుతున్న అన్యాయాలు , దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి రాజ్యాధికారాన్ని సాధించిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. చాకలి, మంగలి, కుమ్మరి, వడ్రంగి, మైనారిటీ సోదరులతో జట్టు కట్టి.. 12,000 మంది గెరిల్లా సైన్యాన్ని తయారుచేసి.. అనేక చిన్నకోటలను వశపరచుకొని, గోల్కొండ కోటపై జెండా ఎగరేసిన పాపన్న గౌడ్ ది గొప్ప పోరాట స్ఫూర్తి అని పేర్కొన్నారు. తమ పాలనలో సామాజిక న్యాయాన్ని పాటించాడని వివరించారు. దేశంలో కులగణనను చేపట్టి, జనాభా దామాషా అనుగుణంగా వారికి అవకాశాలు కల్పించాలని, దేశ సంపదను పంచాలన్నదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభిమతమన్నారు. రాజకీయంగా నష్టం జరిగినా సామాజిక న్యాయం విషయంలో రాహుల్ గాంధీ వెనక్కు తగ్గరని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని తమ రేవంత్ రెడ్డి ప్రభుత్వం యోచిస్తుందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రతిపాదిస్తున్న సామాజిక న్యాయం దిశగా తెలంగాణలోనూ తమ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. గౌడ కులస్తులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉండి పని చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కూచుకుల్ల దామోదర్ రెడ్డి, గోరేటి వెంకన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆమె ఫిజికల్‌గానే ఫిట్.. మెంటల్‌గా కాదు

(మొదటి పేజీ తరువాయి)
ఆమెకు మెంటల్‌గా ఫిట్ నెస్ లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్ మరో వివాదంలో ఇరుక్కున్నారు. ఆలిండియా సర్వీసుల్లో దివ్యాంగుల కోటాపై ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ తన వ్యక్తిగత ఎక్స్ ఖాతాలో చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో దుమారం రేపుతున్నాయి. దివ్యాంగులను అవమానించేలా, వారి శక్తిసామర్థ్యాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ దివ్యాంగ సంఘాలతో పాటు పలువురు ఎంపీలు, న్యాయవాదులు విమర్శించారు.తాజాగా ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వాఖ్యలను తీవ్రంగా ఖండించారు, మాజీ బ్యూరోక్రాట్ బాలలత. ఆమెకు సవాల్ విసిరారు. తనతో సివిల్స్ పరీక్షకు రాయడానికి స్మిత సిద్ధమా అంటూ సవాల్ విసిరారు... బాలలత. తనతో పాటు సివిల్స్ పరీక్షలు రాసి ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని స్మితకి ఆమె సవాల్ చేశారు.
స్మిత సబర్వాల్ గుర్తింపు కోసమే మాట్లాడుతోందని ఆమె ఆరోపించారు. స్మిత సబర్వాల్ మాటలు దురదృష్టకరమన్నారు. అసలు దివ్యంగులం బ్రతకాలా వద్దా? మమ్మల్ని రాష్ట్రంలో ఉండమంటారా? వద్దా? అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పని ఉన్నోళ్ళు పని చేస్తారు. ట్వీట్ లు పెడుతూ ఉండరని బాలలత ఎద్దేవా చేశారు. స్మిత సబర్వాల్ ఫిజికల్ గా ఫిట్ గా ఉన్నారేమో కానీ మెంటల్ గా ఫిట్ గా లేరన్నారు. అసలు స్మిత సబర్వాల్ అర్హత ఎంటి? అని బాలలత మండిపడ్డారు. స్మిత మాట్లాడిన మాటలు ఆమె వ్యక్తిగతమా? తెలంగాణ ప్రభుత్వ విధానమా? అంటూ ప్రశ్నించారు. స్మిత తన సర్వీసులో ఎన్ని రోజులు ఫీల్డ్ వర్క్ లో పరుగెత్తుతూ పని చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు బాలలత. స్మిత ట్వీట్ తాను దివ్యంగుల పట్ల వివక్షతను చూపుతోందన్నారు. ఐటీ యాక్ట్ కింద స్మిత సబర్వాల్ పై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ నేత జైపాల్ రెడ్డికి రెండు కాళ్ళు పనిచేయవు. కానీ బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డు వచ్చిందన్నారు. జైపాల్ రెడ్డికి కాళ్ళు లేకపోయినా ఐఏఎస్ అధికారులే అయన్ని నడిపించారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ మాత్రమే ప్రీమియర్ పోస్టులు అని స్మితకి ఎవరు చెప్పారని బాలలత ప్రశ్నించారు. సీఎం, సీఎస్ ఆలోచించి స్మిత సబర్వాల్ పై చర్యలు తీసుకోవాలన్నారు. స్మిత లాంటి ఆఫీసర్ కి కీలక పోస్టు ఇస్తే ఏమవుతుందో అర్థం అవుతుందన్నారు. స్మిత చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఖండించాలన్నారు.
స్మితపై 24 గంటల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు బాలలత. నిరసన ప్రజాస్వామ్యంలో హక్కు అని సీఎం అన్నారు,... సీఎం మాటలను స్ఫూర్తిగా ట్యాంక్ బండ్ పై ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్నారు. స్మిత చేసిన వ్యాఖ్యలపై సాటి ఐఏఎస్ లు స్పందించాలన్నారు. స్మిత సబర్వాల్ కి ఏదైనా జరగరానిది జరిగి దివ్యంగురాలు అయితే ఐఏఎస్ కి రాజీనామా చేస్తారా? అంటూ ప్రశ్నించారు బాలలత. స్మిత జస్ట్ ఒక ఐఏఎస్ అధికారి మాత్రమే అన్నారు. స్మిత పర్సనల్ లైఫ్, స్మిత రీల్స్ గురించి నేను మాట్లాడను. ఆమె మా కమ్యూనిటిపై మాట్లాడినందుకు రీయాక్ట్ అయ్యాననన్నారు. స్మిత రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతోందని మండిపడ్డారామె.



# రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం

(మొదటి పేజీ తరువాయి)
సమావేశాల్లోపు నగర అభివృద్ధి పలు నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలు ,బడ్జెట్ లో నగరానికి కావాల్సిన అవసరాల పై హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా అభివృద్ధి పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర ఎమ్మెల్యేలు శ్రీ గణేష్,కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, ఎంఐఎం ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబిన్, కౌసర్ మోహినుద్దిన్, అబ్దుల్లా బలాల , మాజిద్ హుస్సేన్ ,జాఫర్ హుస్సేన్ ఎమ్మెల్సీలు బలమురి వెంకట్ , ప్రభాకర్ రావు, మీర్జా రియాజ్ ఉల్ హుస్సేన్ ఎఫండి ,మీర్జా రహమాన్ , తదితరులు పాల్గొన్నారు. శాసన సభ బడ్జెట్ సమావేశాల్లోపు రాజకీయాలకు అతీతంగా నగర ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కని కలిసి నగర అభివృద్ధికి కావాల్సిన అవసరాలు , పెండింగ్ బిల్లులు , నగరంలో జరుగుతున్న ఎస్ఆర్డిపి, ఎస్ఎన్డిపి పనుల పురోగతి తదితర అంశాలపై విజ్ఞప్తి చేయాలని సమావేశంలో చర్చించారు.. నగరంలో డెంగ్యూ కేసులు రాకుండా వైద్యాధికారులు జాగ్రత్త



చర్యలు చేపట్టాలని నీళ్ళు నిల్వ ఉండకుండా జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ ,హెచ్ఎండిఎ,వాటర్ వర్క్స్ , ఎలక్ట్రిసిటీ పలు సమస్యలు , పెండింగ్ బిల్స్, ప్రస్తుతం వర్క్స్ కి అవసరమైన నిధులు హైదరాబాద్ అవసరాలు ఇవి అనే విధంగా ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ సిటీ కి తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కొన్ని మెడికల్ షాపులలో డ్రగ్స్ సంబంధిత ఔషధాలు బయటపడుతున్నాయన్న ఎమ్మెల్యేల పిర్యాదు తో అలాంటివి ఏం ఉన్న తక్షణమే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ పై తీసుకుంటున్న చర్యలు ,లా అండ్ ఆర్డర్ పై హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు. నగరంలో గురుకులాలు ,ప్రభుత్వ హాస్టల్ లు , స్కూల్ లు తదితర వాటిపై ఎమ్మెల్యేలు అధికారులు తనిఖీ చేపట్టాలని కోరారు. అప్పుడే విద్యార్థులకు ఒక భరోసా ఇవ్వగలమని సూచించారు.. నగరంలో స్కూల్ లలో ఉన్న పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు. అన్నిటినీ క్రోడీకరించి హైదరాబాద్ అభివృద్ధి పై ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గకుండా మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షా సమావేశంలో భాగంగా నగర ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యల పై మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటన్నిటిపై వెంటనే అధికారులతో మాట్లాడి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశించారు. కంటోన్మెంట్ లో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని ఎమ్మెల్యే శ్రీ గణేష్ మంత్రి దృష్టికి తీసుకురాగా దానిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇతర అంశాలపై ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోయి సమస్యలు పరిష్కారం చేసుకుందామని హామీ ఇచ్చారు.. అధికారులు వారి డిపార్ట్మెంట్ లలో తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో చర్చించారు జీహెచ్ఎంసీ ,హైదరాబాద్ లా అండ్ ఆర్డర్,వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ తదితర అంశాలపై అధికారులు చర్చించారు.. సమావేశానికి పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి , హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ,HWMS అశోక్ రెడ్డి , CDPCLMD ముస్తఫా ,అడిషనల్ సీపీ లా అండ్ ఆర్డర్ vs మాన్ ,అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వ ప్రసాద్ ,సెంట్రల్ జోన్ డీసీపీ అక్షన్ష్ యాదవ్ వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.

## ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)
కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. రాష్ట్రంలో గత వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం సమీక్షిస్తున్నారని, జిల్లాల్లో ఏవిధమైన ప్రాణ నష్టం తోపాటు ఆస్తి నష్టం కూడా కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముందుగానే, పునరావాస కేంద్రాల ఏర్పాటు పై చర్యలు తీసుకోవాలని, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖ, NDRF, SDRF తదితర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు.
డీజీపీ జితేందర్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా లు కూడా ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల పలు చెరువులు, కుంటలు నిండాయని, అవి తెగకుండా తగు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని అన్నారు. ఇప్పటికే, ముందస్తు జాగ్రత్తలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో NDRF టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఏదైనా అత్యవసర సహాయం కావాలన్నా తమను ఏ సమయంలో నైనా సంప్రదించాలని జిల్లా కలెక్టర్లకు సి.ఎస్ సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు, చెరువు కట్టలు తదితర ప్రాంతాల వద్ద జాగ్రత చర్యలు చేపట్టాలన్నారు. పారే వాగులను ఎవరూ దాటకుండా ఆయా ప్రాంతాలలో తగు బందో బస్తు ఏర్పాటు చేయాలని



తెలిపారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అందరు పోలీస్ కమీషనర్లు, ఎస్.పీ లు జిల్లా కలెక్టర్ తోపాటు ఇతర ప్రభుత్వ అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నారని తెలియచేసారు. ఇప్పటివరకు ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, పోలీస్ అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడు రోజుల పాటు ఒక మోస్తరు నుండి, భారీ వర్షాలతో పాటు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు కురిసే అవకాశముందని తెలిపారు.
భద్రాచలం వద్ద ఇప్పటికే రెండవ ప్రమాద హెచ్చరిక ను ప్రకటించామని, 53 అడుగులకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నట్టు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అన్నారు. ఇప్పటికే జిల్లాల్లో దెబ్బతిన్న నివాస గృహాలు, ఇతర నష్టాలపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏవిధమైన అనుకోని సంఘటలు ఎదురైతే, ఎదుర్కోవడానికి NDRF, SDRF బృందాలను సిద్ధంగా ఉంచామని తెలియచేసారు. అన్ని మండలాలలో మండలాల వారీగా అధికారుల బృందాలను ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉన్నామని ములుగు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతీ గ్రామంలో ప్రత్యేకంగా ఒక సమాచార అధికారిని గుర్తించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అన్నారు. దాదాపు వంద కిలోమీటర్ల విస్తీర్ణంలో ములుగు జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతం ఉందని, 77 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ముందస్తు జాగ్రత్తలను చేపట్టామని వివరించారు. జిల్లాల వారీగా వరదలు, వర్షాల ప్రభావం పై సి.ఎస్, ఆయా జిల్లాల కలెక్టర్ల, CPs/SP లతో సమీక్షించారు.
క్షేత్రస్థాయి అధికారులంతా తమతమ ప్రాంతాల్లో అందుబాటులో ఉండి పరిస్థితికనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని, వీలైనంత వేగంగా స్పందించాలని కోరారు. ఎలాంటి అలసత్యం దృష్టికి వచ్చిన తగు చర్యలుంటాయని పేర్కొన్నారు.
అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో కలెక్టర్లు, CPs, SPs, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, GHMC కమీషనర్ పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి లు తమ ప్రాంతంలో పరిస్థితిని, తీసుకుంటున్న చర్యలు తెలియజేశారు.

## రుణమాఫీ ఏ ప్రాతిపదికన ఇస్తున్నారో అర్థం కావడం లేదు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో సీరియస్ ఇష్యూస్ ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు సొంత డబ్బులతో పనులు చేయించారు. ఇప్పుడు వారి బదిలీ జరిగింది.. లబోదిబోమంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సోమవారం మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు కేంద్ర నిధులు వచ్చినా మంజూరు చేయడం లేదు. పంచాయతీ ఎన్నికలు కాకపోవడంతో 750 కోట్లు కేంద్రం నిధులు ఆపింది. అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు అన్న చందంగా మారింది. ప్రతిపక్షం తట్టి లేపితే కానీ రాష్ట్ర ప్రభుత్వం మేల్కొవడం లేదని హరీశ్ రావు విమర్శించారు.
కేంద్రం 800 కోట్లు ఉపాధి హామీ పథకానికి ఇచ్చింది.. రాష్ట్ర వాటా కలిపి విడుదల చేయాలి. ఆర్థిక సంఘం నిధులు 500 కోట్లు వచ్చినా ప్రభుత్వం విడుదల చేయడం లేదని హరీశ్ రావు అన్నారు. బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు నెలలుగా జీతం లేదు. పంచాయతీ ఎన్నికలు పె



ట్టకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. ప్రభుత్వ హాస్టళ్ల లో పనిచేసే కింది సిబ్బందికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జీతాలు ఇప్పటివరకు రాలేదు. అసెంబ్లీలో అవకాశం వస్తే అన్ని అంశాలపై ప్రభుత్వం దుమ్ము దులుపుతా. నాకు అవకాశం వస్తే ఎనిమిది మంది మంత్రులు అడ్డుతగులుతున్నారని హరీశ్ రావు అన్నారు.
రాష్ట్రంలో సమస్యలతో రోడ్డు ఎక్కని వర్గం లేదు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా విద్యుత్ సంక్షోభం తలెత్తుతుంది. విద్యుత్ వినియోగంలో పెద్దగా తేడా లేదు. విద్యుత్ స్టోర్ లలో మెటీరియల్ లేదు. ఉచిత కరెంట్ పథకానికి ఒక్క రూపాయి విడుదల కాలేదు. విద్యుత్ శాఖ ఆర్థికంగా దివాళాతీసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలకు కొన్నిచోట్ల కరెంట్ కట్ చేశారని హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో 91లక్షల మంది తెల్ల రేషన్ కార్డు దారులకు గృహజ్యోతీ అమలు కావడం లేదు. వృధాప్య పెన్షన్లు సక్రమంగా అందడం లేదు. మే నెల పెన్షన్ ఇప్పటి వరకు అందలేదు. పెంచిన పెన్షన్ అటుంచి పాత పెన్షన్ ఇవ్వడం లేదు. విడో పెన్షన్లు ఎనిమిది నెలలుగా ఆగిపోయాయని హరీశ్ అన్నారు.
రైతు రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధన అమలు చేస్తున్నారు. 30నుంచి 40శాతం మందికి రుణమాఫీ జరుగలేదు. కోతలు పెట్టడానికి నిబంధనలు వాడుతున్నారు. రుణమాఫీ ఏ ప్రాతిపదికన ఇస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే కొత్త జీఓ తెచ్చి రైతులను రుణమాఫీ వర్తింప చేయాలి. రైతు, పాస్ బుక్ ఆధారంగా రుణమాఫీ ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## పనులున్నాయ్.. పైసల్ గావాలె!

(మొదటి పేజీ తరువాయి)
శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు సీఎం రేవంత్ రెడ్డి కలిశారు.

**ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు బకాయిలు విడుదల చేయాలి**

రాష్ట్రంలో 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ దృష్టికి తీసుకెళ్లిన రేవంత్ రెడ్డి, వినియోగదారులకు ఇచ్చే రాయితీని ముందుగానే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు చెల్లించే అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

**సోనియా , రాహుల్, ప్రియాంకలతో భేటీ**

ఆ తర్వాత కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీని కలిసేందుకు ఆమె నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి రాహుల్‌గాంధీని కలిశారు. ఆయన వెంట మంత్రులు భట్టి, ఉత్తమ్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ ఉన్నారు. అంతకుముందు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీతో సీఎం భేటీ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముఖ్యమంత్రి సహా మంత్రులు మంగళవారం హైదరాబాద్ రానున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

## పార్లమెంట్ వేదికగా రాజకీయాలా?

**విశ్వంభర, దిల్లీ :** కొన్ని పార్టీలు పార్లమెంట్ వేదికగా ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ మండిపడ్డారు. పార్లమెంట్ ఉన్నది రాజకీయాల కోసం కాదని, దేశం కోసమని అన్నారు. వచ్చే అయిదేళ్లు దేశాభివృద్ధి కోసం పోరాడాలని ఆయన విపక్షాలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఆయన మీడియాతో మాట్లాడారు.. కొన్ని పార్టీలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పార్లమెంటు సమయాన్ని ఉపయోగించుకున్నాయని, ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. గత సెషన్‌లో తనను మాట్లాడనివ్వకుండా చేయాలని ప్రతిపక్షాలు ప్రయత్నించాయన్నారు. ప్రజాస్వామ్యంలో అలాంటి ఎత్తుగడలకు తావులేదన్నారు. పార్లమెంట్ తొలి సెషన్‌లోనే 140 కోట్ల మంది దేశ ప్రజల మెజారిటీతో ఎన్నికైన ప్రభుత్వం గొంతును నొక్కే ప్రయత్నం చేశారన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. మూడోసారి అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు.

**అమృతకాలంలో అద్భుత బడ్జెట్**

కేంద్ర బడ్జెట్ రానున్న అయిదేళ్ల ప్రయాణానికి దిశానిర్దేశం చేస్తుందని, 2047లో 'వికసిత్ భారత్' కలను సాకారం చేసేందుకు పునాది వేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. అమృత్ కాల్ లో ఇది అద్భుత బడ్జెట్ అని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



(మొదటి పేజీ తరువాయి)
తెలంగాణలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. జూలై 23 నుంచి ప్రారంభం కానున్న సమావేశాల్లో ముందుగా గవర్నర్ ప్రసంగం ఉండనుంది. జూలై 25న బడ్జెట్ ప్రవేశపెట్టనుంది సీఎం రేవంత్ సర్కార్. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు బిజీబిజీగా ఉన్నారు. 25న అసెంబ్లీకి హాజరై తెలంగాణ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క. అదే రోజు అసెంబ్లీకి వెళ్లాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. మంగళవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారన్న వార్త రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిని రేపింది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే లాస్యనందిత మృతికి సభ్యులు సంతాపం తెలపనున్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బీఆర్ఎస్ ప్రతిపక్షపాత్రకు పరిమితమైంది. ఈ నేపథ్యంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాలుకు తుంటి ఎముకకు శస్త్ర చికిత్స జరగడం, వైద్యులు విశ్రాంతి అవసరం అని చెప్పడంతో ఆయన లేకుండానే గత అసెంబ్లీ సమావేశాలు సాగాయి. కేటీఆర్, హరీష్ రావులే సభలో కాంగ్రెస్ పార్టీ సభ్యులను తమదైన శైలిలో మాటలతో ఎదుర్కొన్నారు. అయితే ఈసారి అసెంబ్లీ సమావేశాలు జరిగేసరికి దాదాపు చాలా మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీ మారి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేల బలం కూడా తగ్గుతోంది. త్వరలో బీఆర్ఎస్సెల్పీని కాంగ్రెస్ లో విలీనం చేస్తామని చెబుతున్నారు కొందరు కాంగ్రెస్ నేతలు. ఈ నేపథ్యంలో అన్నీతానై తిరిగి పార్టీకి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు అసెంబ్లీనే వేదిక చేసుకోనున్నారు కేసీఆర్ అని అంటున్నారు పార్టీ శ్రేణులు. మరి కేసీఆర్ రాకతో అసెంబ్లీ సమావేశాలు ఎలా సాగుతాయో అన్న ఉత్కంఠ చాలా మందిలో నెలకొంది.

# ఈ పొద్దు.. కేంద్ర పద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీ 3.0 సర్కారుకు ఇదే తొలి పద్దు కావడం కూడా ఈ బడ్జెట్‌పై అంచనాలు, ఆశలు అధికమవడానికి కారణమవుతోంది. ముచ్చటగా మూడోసారి అధికార పీఠాన్ని దక్కించుకోగలిగినప్పటికీ గతంతో పోలిస్తే లోక్‌సభలో బీజేపీ సంఖ్యాబలం తగ్గింది. ఈ నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే జనాకర్షక నిర్ణయాలను కుడా ప్రభుత్వం ప్రకటించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ బడ్జెట్ ఎలా ఉండబోతుందా అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎవరికి తీపి కబురు, ఎవరికి చేదు వార్త ఉండబోతోందన్న ప్రశ్నలకు కొద్ది గంటల్లోనే సమాధానాలు లభించనున్నాయి. అలాగే మిత్రపక్షాల ఎజెండాకు అనుగుణంగా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందా? అనేది కూడా తేలనుంది.

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దృష్టి**

పార్లమెంట్ ఎన్నికలకు ముందు అప్పటి ఎన్డీయే ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఆ ఓటాన్ అకౌంట్ త్వరలో ముగియనుండటంతో ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 202425కి సంబంధించిన బడ్జెట్‌ను మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభలో ప్రవేశ పెట్టనున్నారు. ఇక ఈ బడ్జెట్ లో ప్రధానంగా ఉద్యోగాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. తయారీ రంగంలో కొత్త కంపెనీల కోసం గతంలో ప్రకటించిన లాభదాయక ట్యాక్స్ విధానాన్ని పొడిగించాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. దీంతో మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టర్ పై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అదే విధంగా ఈసారి బడ్జెట్‌లో నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా కూడా అడుగులు వేయాలని యువత కోరుకుంటోంది. ఈ అంశాలపై కొన్ని ప్రత్యేక ప్రకటనలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విదేశాల నుంచి దేశంలోకి దిగుమతి అవుతున్న ఆయా ముడి సరకులపై భారీ సుంకాలు పెను భారంగా మారాయని వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ముడి సరుకులు, పదార్థాలపై పన్నులు తగ్గించడం వంటివి కూడా ఉండవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో పారిశ్రామిక రంగాన్నికి, ఆటోమొబైల్ రంగానికి ఊరట కల్పించే అవకాశం ఉంది. పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వెహికల్, ఇతర గ్రీన్ సాంకేతికలతో ఇన్వెస్ట్ మెంట్ పెట్టే కంపెనీలకు పన్ను రాయితీలు కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులలో గణనీయమైన పెట్టుబడులకు అవకాశం ఉంది. భారతదేశంలో కాలుష్య తీవ్రతను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది. మొత్తం మీద వికసిత భారత్ అనే నినాదంతో ముందుకెళ్తున్న ఎన్డీయే ప్రభుత్వం అలాంటి అభివృద్ధి కోసం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.



## విజన్ 2047కు అనుగుణంగా..

ప్రధాని మోదీ పదేపదే ప్రస్తావిస్తున్న వికసిత్ భారత్ 2047 విజన్‌కు అనుగుణంగా మౌలికవసతుల అభివృద్ధి, రక్షణ రంగంలో ఆధునికీకరణ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యసేవలు తదితర రంగాలపై కేంద్రం ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసారించే అవకాశాలున్నాయి. మధ్యంతర పద్దులో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం సముచిత ప్రాధాన్యమిచ్చింది. మూలధన పెట్టుబడుల కోసం రూ.11.11 లక్షల కోట్లు కేటాయించింది. అంతకుముందు బడ్జెట్‌తో పోలిస్తే అది ఏకంగా 11% అధికం. పూర్తిస్థాయి బడ్జెట్‌లోనూ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడం దాదాపు ఖాయమే. ముఖ్యంగా రహదారులు, రైల్వే, గృహనిర్మాణ రంగాలకు కేటాయింపులు పెరగొచ్చు. ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరలు పెరగాలని రైతులు ఆశిస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద అందించే నగదు సాయం పెంపుపైనా అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. దేశీయంగా ఉత్పత్తి రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు కేంద్రం కీలక నిర్ణయాలు ప్రకటించొచ్చు.ముచ్చటగా మూడోసారి అధికార పీఠాన్ని దక్కించుకోగలిగినప్పటికీ గతంతో పోలిస్తే లోక్‌సభలో బీజేపీ సంఖ్యాబలం తగ్గింది. ఈ నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే జనాకర్షక నిర్ణయాలను కుడా ప్రభుత్వం ప్రకటించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**నిర్మలమ్మ ఏడో బడ్జెట్**

కేంద్ర ఆర్థికమంత్రిగా నిర్మలా సీతారామన్ తీసుకురానున్న ఏడో బడ్జెట్ ఇది. కొత్త పద్దులో అభివృద్ధి, సంక్షేమాల మధ్య ప్రభుత్వం సమతూకం పాటించాలని వృద్ధికి ఊతమివ్వడమే కాకుండా ద్రవ్యోల్బణం కట్టడిపై దృష్టిసారించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

**మహిళల ఆర్థిక సాధికారత కోసం కొత్త పథకాలు**

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు మోదీ సర్కారు సామాజిక, సంక్షేమ వ్యయాలను పెంచే అవకాశాలున్నాయి. ముఖ్యంగా గ్రామీణరంగ పథకాలపై వ్యయం పెంచొచ్చు. ఇళ్ల నిర్మాణాలకు చేయూత అందించొచ్చు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, ఉద్యోగాల కల్పనపై దృష్టిసారించొచ్చు. ప్రజారోగ్య బీమా కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు ఆస్కారముంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 70 ఏళ్లు దాటిని వృద్ధులు అందరూ ఆయుష్మాన్ భారత్ కిందకు వస్తారని పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రకటించారు. ఆయుష్మాన్ భారత్ కింద బీమా కవరేజిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచే అవకాశాలు ఉన్నాయి. దేశ జనాభాలో 30 శాతం మందికి ఆరోగ్య బీమా లేదని ఇటీవల ఓ నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ పథకంలో లబ్ధిదారుల సంఖ్యను కూడా భారీగా పెంచే విధంగా ఈ బడ్జెట్‌లో కేంద్రం కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. మహిళల ఆర్థిక సాధికారత కోసం కొత్త పథకాలను ఈ బడ్జెట్‌లో ప్రకటించొచ్చు.

**పన్నుపై ఉపశమనం దక్కేనా**

**గత కొన్నేళ్లలో జీవనవ్యయం గణనీయంగా పెరిగింది. అందుకు తగ్గట్టు వేతనజీవులకు ఆదాయపు పన్ను విషయంలో ఉపశమనాలు మాత్రం దక్కలేదు. ఈసారైనా కాస్త ఊరట దక్కుతుందేమోనని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రూ.10 లక్షల లోపు ఆదాయమున్న మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు కొత్త పద్దులో కొంత ఉపశమనం లభించే అవకాశాలున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఈసారి పన్ను రేట్లను తగ్గిస్తుందని, 5 లక్షల రూపాయల వార్షికాదాయం వరకు పూర్తిగా పన్ను మినహాయింపునిచ్చే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి.**

# ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్రలో భారీ అగ్నిప్రమాదం

**విశ్వంభర, ముంబై :** ఇండియన్ నావల్ యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్రలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మహారాష్ట్ర ముంబైలోని డాక్‌యార్డ్‌లో ఆదివారం సాయంత్రం రీఫిట్ పనులు నిర్వహిస్తుండగా మంటలు చెలరేగినట్లు సంబంధిత అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ అగ్ని ప్రమాదంలో ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్ర తీవ్రంగా దెబ్బతింది. మరోవైపు.. ఆ ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్రలో ఉన్న ఒక సెయిలర్ జాడ గల్లంతు కాగా.. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు చర్యలు చేపట్టారు. గల్లంతైన సెయిలర్ (అధికారి) కోసం గాలింపు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ముంబై డాక్‌యార్డ్‌లో ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్రకు రీఫిట్ పనులు చేస్తుండగా మంటలు చెలరేగినట్లు నేవీ అధికారులు వెల్లడించారు. వెంటనే అప్రమత్తమైన నేవీ సిబ్బంది.. ఫైర్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి మంటలను అదుపు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే ఆదివారం సాయంత్రం మొదలు పెడితే.. మంటలను అదుపు చేయడానికి సోమవారం ఉదయం



పట్టిందని అధికారులు వెల్లడించారు. డాక్‌యార్డులో ఉన్న ఇతర నౌకా సిబ్బంది కూడా ఈ రెస్క్యూ కార్యక్రమాల్లో పాల్గొన్నారని చెప్పారు. ఇక భారీ అగ్నిప్రమాదం ధాటికి ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్ర.. ఒకవైపు ఒరిగిపోయినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్రను మళ్లీ యథాస్థానానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు వివరించారు. ఈ ఘటనలో ఒక జూనియర్ సెయిలర్ జాడ గల్లంతు కావడంతో అతని కోసం గాలింపు చేపట్టారు. మిగితా సెయిలర్లను బయటికి తీసుకువచ్చినట్లు తెలిపారు. మరమ్మతుల కోసం ముంబై డాక్‌యార్డులో ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్రను నిలిపి ఉంచిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్రను భారత్ స్వదేశీ టెక్నాలజీతో తయారు చేసింది. క్లాస్ గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్‌లో ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్ర మొట్ట మొదటిది కావడం గమనార్హం. ఐఎన్‌ఎస్ బ్రహ్మపుత్ర 2000 ఏప్రిల్ నెలలో భారత నౌకాదళంలోకి ప్రవేశించింది. ఈ నౌకలో 40 మంది అధికారులు.. 330 మంది సెయిలర్లు, సిబ్బంది ఉంటారు. వీరిలో ఒక జూనియర్ సెయిలర్ తప్ప మిగిలిన అందరూ క్షేమంగా ఉన్నారని నేవీ అధికారులు స్పష్టం చేశారు. ఆ గల్లంతైన సెయిలర్ కోసం గాలింపు జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రమాదంపై కూడా విచారణ జరుగుతుందని నౌకాదళం తెలిపింది.




# ఆరేళ్లలో 78.5 లక్షల ఉద్యోగాలు




**విశ్వంభర, ఢిల్లీ:** వ్యవసాయేతర రంగంలో 2030 నాటికి ఏటా సగటున 78.5 లక్షల ఉద్యోగాలను సృష్టించాల్సి ఉందని 202302024 ఆర్థిక సర్వే నిర్దేశించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీ రంగంలో పెద్దగా నియామకాలు జరగడం లేదని పెరుగుతున్న శ్రామికశక్తి అవసరాలను తీర్చడానికి భారత ఆర్థిక వ్యవస్థ ఈ చర్యలు తీసుకోవాలని సూచించింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండో పార్లమెంట్ సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 20232024 ఆర్థిక సర్వేను లోక్‌సభలో సమర్పించారు. ఇది 202324 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వే. ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పలు ముఖ్యమైన విషయాలను ఇందులో ప్రస్తావించారు. వీటిలో జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం, ఉపాధి రేటు, ఆర్థిక లోటు వంటి అనేక అంశాలు ఉన్నాయి. మరోవైపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇబ్బందులు ఉన్నాయని, ఇది మూలధన ప్రవాహాలపై ప్రభావం చూపుతుందని ఆర్థిక సర్వే పేర్కొంది. సేవారంగంలో మున్ముందు మంచి వృద్ధి ఉండవచ్చునని,ఉద్యోగావకాశాల కల్పనలో కార్పొరేట్ రంగం పాత్ర పెరగాలని సూచించింది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం రేటు 2023 మొదటి మూడు నెలల్లో 6.7 శాతానికి తగ్గుతుందని పేర్కొంది.

**జీడీపీ వృద్ధి**

బడ్జెట్‌కు ముందు సమర్పించిన ముఖ్యమైన ఆర్థిక పత్రం ఇది. దీని ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి అంచనా 2024 ఆర్థిక సంవత్సరానికి 6 నుంచి 6.8 శాతం మధ్య ఉంటుందని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025కి భారతదేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతం మధ్య ఉంటుందని అంచనా వేశారు. అంటే వాస్తవ వృద్ధి దీని కంటే కొంచెం తక్కువగా లేదా ఎక్కువగా ఉండవచ్చు.

**అయిదో స్థానానికి భారత్**

కోవిడ్19 మహమ్మారి తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని ఆర్థిక సర్వే పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరంలో లో వాస్తవ జీడీపీ 2020 ఆర్థిక సంవత్సరం కంటే 20 శాతం ఎక్కువ. ఇది కొన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు మాత్రమే సాధించగలిగిన ఘనత. భౌగోళిక రాజకీయ, ఆర్థిక మార్కెట్, వాతావరణ ప్రమాదాలకు లోబడి 2025లో లో బలమైన వృద్ధిని కొనసాగించే అవకాశాలు బాగానే ఉన్నాయి. ప్రైవేట్ క్యాపిటల్ మార్కెట్ బలంగా ఉంది.2024లో దీని ద్వారా రూ.10.9 లక్షల కోట్ల మూలధనం సమీకరించబడింది. దీంతో భారత స్టాక్ మార్కెట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో జీడీపీ, మార్కెట్ క్యాపిటలైజేషన్ నిష్పత్తిలో భారత్ ప్రపంచంలోనే అయిదో స్థానానికి చేరుకుంది.

**వ్యవసాయంపై..**

దేశంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రాధాన్యం పెరుగుతుందని సర్వే తెలిపింది. ఈ ఏడాది ఎన్‌హెచ్ ఏఐ 33 ఆస్తులు విక్రయించడానికి ఉన్నట్లు గుర్తించారు. వేటు రంగం లాభం పెరిగిందని, కానీ ఉపాధి అవకాశాలు అందుకు అనుగుణంగా పెరగలేదని కూడా చెబుతోంది. వ్యవసాయంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సర్వే ప్రస్తావించింది. భవిష్యత్తులో భారతదేశ ఆర్థిక ఆరోగ్యం ఎలా ఉంటుందో ఆర్థిక సర్వే గుర్తు చేసింది. భౌగోళికరాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని ఆర్థిక సర్వే 2024 వివరించింది. ఇందులో మానసిక ఆరోగ్యం, వ్యవసాయంపై దృష్టి సారించాలని వెల్లడించింది.

**ద్రవ్యోల్బణం**

ప్రపంచ సంక్షోభం, సరఫరా గొలుసు అంతరాయాలు, రుతుపవన అనిశ్చితి కారణంగా ద్రవ్యోల్బణ ఒత్తిడిని పరిపాలనా, ద్రవ్య విధానాల ద్వారా సమర్థవంతంగా నిర్వహించినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. దీని కారణంగా 2023లో లో రిటైల్ ద్రవ్యోల్బణం సగటున 6.7 శాతంగా ఉంది. 2024లో 5.4 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణానికి సంబంధించి ఆర్‌బీఐ అంచనా ప్రకారం సాధారణ రుతుపవన వర్షాలు, బాహ్య లేదా విధానపరమైన షాక్‌లు లేని సందర్భంలో రిటైల్ ద్రవ్యోల్బణం 2025లో 4.5 శాతం నుంచి 2026లో 4.1 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.




# బ్రిటిష్ పాలకులకు సింహ స్వప్నం
# చంద్రశేఖర్ ఆజాద్

## నేడు ఆజాద్ జయంతి

**భారత స్వాతంత్ర్య ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆజాద్ గర్వించదగ్గ అసహాయ శూరుడు, అసమాన వీరుడు.**

**భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారాం తివారి. ఆయన "పండిత్‌జీ"గా కూడా పిలువ బడ్డాడు. 1857 తరువాత సాయుధ పోరాటం చేసిన వీరుల్లో మొట్టమొదటి వాడు, దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనదని గట్టిగా నమ్మినవాడు ఆజాద్.**



మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బాబ్రా గ్రామంలో పండిట్ సీతారాం తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించాడు. ప్రాథమిక విద్యను సొంత గ్రామంలోనే పూర్తి చేసి, తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించాడు. ఆయన చిన్నప్పటి నుంచి హనుమాన్ భక్తుడిగా ఉండేవాడు.

1919 లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యాడు. విచారణ సందర్భంగా కోర్టులో ఆయనను విచారిస్తున్న బ్రిటిష్ న్యాయాధికారి ఖరేఘాట్‌కు ఆ బాలుడిచ్చిన సమాధానంతో మతి పోయింది. వాస్తవానికి తన పేరు 'ఆజాద్' అని, తన తండ్రి పేరును 'స్వతంత్ర్యం', తన నివాసం 'జైలు' అని చెప్పాడు. "మతి పోయిన ఆ న్యాయాధికారి చిదిమితే పాలుగారే ముఖారవిందుడైన ఆ బాలుడిని చూస్తూ కూడా అధికార దర్పంతో '15 కొరడాల దెబ్బల' శిక్ష ప్రకటించాడు. నరరూప రాక్షసులు కొరడా ఝుళిపిస్తూ ఒక్కొక్క దెబ్బ కొడుతుంటే.. ఆ బాలుని శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అయినా ఆ బాలుడు దెబ్బ పడినపుడు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటున్నాడు. ఈ ధైర్యం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ రోజు నుంచి ఆయన పేరు 'చంద్ర శేఖర్ ఆజాద్'గా మారింది.

"సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవ వాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటిష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందేనని ఆయన బలంగా నిశ్చయించు కున్నాడు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖదేవ్ తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారాడు. ఆజాద్.. 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చి వేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చు కోవడానికి 1928వ సంవత్సరంలో లాహోర్‌లో జేపీ సాండర్స్‌ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలు పంచు కున్నాడు.

ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్‌లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలి పెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలు పంచుకున్న ఆజాద్... ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. 1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదులోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టు ముట్టారు. ఆజాద్‌ను లొంగి పోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు ఎదురు తిరిగాడు. వెంబడిస్తున్న పోలీసుల్లో ముగ్గురిని కాల్చి చంపాడు. ఐనా తరుముతూ వస్తున్న పోలీసులకు చిక్కే పరిస్థితి వచ్చింది. ఇక తుపాకీలో ఒకే ఒక్క బుల్లెట్ వుంది. దానితో వాళ్లను మట్టుబెట్ట లేనని తెలుసుకుని, బ్రిటిష్‌వారి చేతిలో చనిపోవడం కంటే తనకు తానే ఆత్మత్యాగం చేసుకోవాలను కున్నాడు. వెంటనే తుపాకీని తన తలకు గురిపెట్టి కాల్చుకుని అమరడయ్యాడు.''నీలో ఉన్నది ఉప్పునీరా? అయితే నీకోసమే బతుకు. కాదూ ఉడుకు రక్తమంటావా? అయితే దేశం కోసం మరణించు. నీ దేహం నిప్పు కణాల కొలిమి అయితే అనుక్షణం నీ ప్రాణాన్ని సంఘానికి సమర్పించు. నీ గుండెకాయ పత్తికాయ అయితే భరత మాతను మరిచిపోయి నీ సుఖమే చూసుకో'' ఇలా రోమాలు నిక్కబొడుచు కునేలా పలికిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్.

బతికుండగా బ్రిటీష్ వారు నన్ను పట్టుకోలేరు. వాళ్ళకు అంత దమ్ము లేదు. అని పదే పదే ఆజాద్ అంటుండే వాడు. "నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను'' అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ, పోలీసులకు చిక్కక, పిస్తోలుతో పేల్చుకుని స్వతంత్ర జీవిగా అస్తమించాడు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ స్వాతంత్ర చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువతకు ఒక మహోజ్వల ప్రేరణ, అసమాన ఉదాహరణ.

చివరిదాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులు సాధ్యంకాక... ఆయన మృత దేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఆజాద్ ఆత్మత్యాగం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాట పథం పట్టేలా ప్రోత్సహించింది.

ఆజాద్ మరణించిన అలహాబాదు లోని ప్రయాగ్‌రాజ్ పార్కుకు చంద్రశేఖర్ ఆజాద్ పార్కుగా నామకరణం చేయ బడింది. మరణించే సమయంలో 'ఆజాద్' వద్ద ఉన్న పిస్టల్ అలహాబాద్ మ్యూజియంలో ప్రదర్శించ బడింది. 1988లో భారత ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్ ముఖచిత్రంతో తపాలా బిళ్ళను విడుదల చేసింది.

1965లో షహీద్ సినిమాతో ప్రారంభించి పలు భాషలలో ఎన్నో సినిమాలు నిర్మించ బడ్డాయి.

2018లో టెలివిజన్ సీరీస్ తీయబడింది. చంద్రశేఖర్ ఆజాద్ జన్మించిన మధ్య ప్రదేశ్‌లోని భభ్రా (భవ్రా) గ్రామం చంద్రశేఖర్ ఆజాద్ నగర్‌గా పిలవడం జరుగుతోంది.

---

**బాలగంగాధర తిలక్ స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యాగమూర్తులతో అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరచిపోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృతమొనర్చిన మహానేత లోకమాన్య తిలక్.**

# భారత జాతీయోద్యమ పిత
# బాలగంగాధర తిలక్

## నేడు ఆయన జయంతి



బాలగంగాధర తిలక్ 1856 జూలై 23న మహారాష్ట్ర లోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి ఎక్కడ అన్యాయం జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన నైజం. కళాశాలకు వెళ్లి ఆధునిక, ఆంగ్ల విద్యనభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వారిలో కూడా తిలక్ అగ్రగణ్యులే. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు ఆయన తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లోవెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయులవద్ద విద్యనభ్యసించారు. అయితే పుణెకు వచ్చిన కొంత కాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువుతున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రుడయ్యారు. ఆ తర్వాత చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు.

**పాశ్చాత్య విద్యకు వ్యతిరేకం**

తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్నబుచ్చే విధంగా ఉందని ఆయన అభిప్రాయం. మంచి విద్యను అందించడం ద్వారానే విద్యార్థులను మంచి పౌరులుగా మార్చవచ్చని భావించారు. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలనేది ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి "దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ"ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన "మరాఠా (ఆంగ్ల పత్రిక)", "కేసరి (మరాఠీ పత్రిక)" లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించి వారిని జాతీయోద్యమం వైపు నడిపించారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాశారన్న అభియోగంతో 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష విధించారు. విడుదలయ్యాక తిలక్ స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం కింద ఆయనకు ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే "గీతారహస్యం" అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీతపై ఆయన రచించిన భాష్యం 856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు పదిహేను రోజుల్లోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానం పొందిందో స్పష్టం అవుతుంది. అన్ని భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి.

1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్‌లో హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేశారు. ఆ ఉద్యమం ఉద్ధృతంగా కొన సాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో ఆయన లండనుకు వెళ్లవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు "బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్నివ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించారు.

బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడంతో, తిలక్ విభేదించారు. ఇద్దరిదీ చెరొక దారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. 1920 ఆగస్టు 1న తిలక్ అసువులు బాశారు. కానీ ప్రజల్లో ఆయన రగిలించిన స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది.

### కాంగ్రెస్‌లో అతివాద శకానికి ఆద్యుడు

తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని నమ్మారు. అప్పటివరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితమయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతం కాదని, విన్నపాలు, వినతులు వలన ప్రభుత్వాన్ని లొంగదీయలేవని తిలక్ విశ్వాసం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలేతో చాలా అంశాలలో తిలక్‌కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరానికొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడే లాలాలజపత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్ లను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్‌బాల్‌పాల్‌గా ప్రసిద్ధులయ్యారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టుకున్నారు. దాంతో అతివాదులుగా భావించే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒక్కటయ్యారు. అదే సమావేశంలో కాంగ్రెస్‌కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది.

---

# దేశాభివృద్ధికి రేడియో ప్రసారాల చేయూత

## బొంబాయి కేంద్రం నుంచి ప్రారంభమై నేటికి 97 ఏళ్లు

అందరి ఇళ్లలో ఇప్పుడు టీవీ ఉన్నట్లే కొంత కాలం క్రితం ప్రతి ఇంట్లో రేడియో సెట్ ఉండేది. రేడియో ద్వారానే నాడు నిత్య ప్రాపంచిక విషయాలు ప్రజలకు చేరేవి. సమయసారిణి ప్రకారం వివిధ కార్యక్రమాలు ప్రసామయ్యేవి. నాడు ప్రధాన మనో రంజన సాధనాల్లో రేడియో ప్రధానమైనది. 1923 జూన్‌లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైనా, 1927 జూలై 23న తొలి సారిగా బొంబాయి రేడియో స్టేషన్ ప్రారంభం అయింది.

రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారం లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేసే ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. తొలి రోజులలో వాల్వులను ఉపయోగించి, రేడియోలను తయారు చేసేవారు. అవి ఎక్కువ విద్యుత్‌ను వాడేవి, పరిమాణంలో కూడా చాలా పెద్దగా ఉండేవి. ఒక చోట మాత్రమే ఉంచి వినవలసి వచ్చేది. 1960లు వచ్చేటప్పటికి, ట్రాన్సిస్టరును కనిపెట్టారు. తర్వాతవ అవి వాడకంలోకి వచ్చాయి. వీటిని ట్రాన్‌సిస్టర్ రేడియోలు అని పిలిచే వారు. ఇవి విద్యుత్‌ను చాలా తక్కువగా వాడుకుని, అలాగే బ్యాటరీ తో కూడా పని చేయగలవు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిరేడియోలు చిన్నవి, అతి చిన్నవిగా మారి పోయాయి. జేబులో పట్టే సైజులో కూడా వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లోకి విడుదలవుతున్న ప్రతీ కంపెనీ మొబైల్స్ లోనూ రేడియో అప్లికేషను తప్పనిసరి అయిపోయింది. సమాచారాల చేరవేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ సమకూర్చుకుని మార్కోనీ విస్తృత పరిశోధనలు చేశాడు. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన గొప్పతనం మార్కోనీకే దక్కింది. ఆయన క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. అందులో కృతకృత్యుడయ్యాడు.

1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపించిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలోకెల్లా తొలి ప్రసార కేంద్రం పిట్స్ బర్గ్ లో స్థాపితమైంది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2న కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు. 1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారైంది.



1923 జూన్ లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభ మైనాయి. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.

ఆకాశవాణి ప్రపంచంలోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయం దిల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ ఆధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యంలో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే. దేశాభివృద్ధిలో ప్రభుత్వాధీంలో ఉన్న రేడియో, అన్ని రంగాలలోను సమాచారాన్ని ఇస్తూ దేశ సమగ్రతకూ, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశ వ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92%, మొత్తం జనాభాలో 99.19%కి చేరుకుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగుతున్నాయి.

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసరికి 6 ఆకాశవాణి కేంద్రాలు (కలకత్తా, దిల్లీ, బొంబాయి, మద్రాసు, లక్నో, తిరుచిరాపల్లి) మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు 215 అకాశవాణి కేంద్రాలు 337 ప్రసార కేంద్రాలు (144 MW కేంద్రాలు, 54 SW కేంద్రాలు, 139 ఎఫ్ఎం కేంద్రాలు)తో 77 ఆకాశవాణి కేంద్రాలు 99.13% ప్రజలకు ప్రస్తుతం ప్రజలకు సమాచారాన్ని, విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తున్నాయి.

ఆకాశవాణి తొలి తెలుగు ప్రసారాలు 1938 జూన్ 16న ప్రారంభమయ్యాయి. ఆరోజు సాయంత్రం 5.30గంటలకు సౌరాష్ట్ర రాగంలో త్యాగరాజ స్వామి రచించిన శ్రీ గణపతిని సేవింపరాదే అనే తెలుగు కృతిని తిరువెన్కాడు సుబ్రహ్మణ్యపిళ్లై నాదస్వరంపై వాయిస్తుండగా అదే తొలి ప్రసారంగా మద్రాసు కేంద్రం ప్రారంభమైంది. ఆ రాత్రే 8.15కు భారత దేశం రేడియో అంశంపై ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రధాని సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు తెలుగులో ప్రసంగించారు.

మద్రాసు కేంద్రం తొలి తెలుగు ప్రసంగాల్లో 1938 జూన్ 18న సజీవమైన తెలుగు అనే అంశంపై గిడుగు రామమూర్తి పంతులు, జూన్ 21న మన ఇల్లు దాని అందము చందము అనే అంశంపై కోలవెన్ను రామకోటేశ్వరరావు, జూన్ 23న రవీంద్రుని గురించి బెజవాడ గోపాలరెడ్డి 15నిమిషాల వ్యవధి గల ప్రసంగాలు చేశారు. ముద్దుకృష్ణ రాసిన అనార్కలి మద్రాసు కేంద్రం నుంచి ప్రసారమైన తొలి తెలుగు నాటకం. 1938 జూన్ 24 రాత్రి 8.30గంటలకు ఆ నాటకం ప్రసారమైంది. 1938 జూన్ 25 రాత్రి తొలిగా జానపద సంగీతం ప్రసారమైంది.

ఆకాశవాణి మద్రాసు కేంద్రం తెలుగులో తొలి ప్రసారాలు చేయగా 1948 అక్టోబరు 12న తొలి తెలుగు రేడియో స్టేషనుగా విజయవాడ కేంద్రం ప్రారంభమైంది. అదే సంవత్సరం డిసెంబరు 1న విజయవాడ కేంద్రం ప్రసారాలు ప్రారంభించింది. 1933లో హైదారాబాద్ చిరాగ్ అలీ వీధిలో మహబూబ్ అలీ 200వాట్ల శక్తిగల రేడియోకేంద్రాన్ని స్థాపించారు. దాన్ని 1935 ఫిబ్రవరి 3న నిజాం తన అదుపులోకి తీసుకున్నారు. దక్కన్ రేడియోగా 7వ అసఫ్ జా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నిజాము ఉర్దూ ప్రసారాలతో ప్రారంభించినా పరిమితంగా తెలుగు, కన్నడ, మరాఠీ కార్యక్రమాలుండేవి. స్టూడియో సరూర్‌నగర్ నుంచి ఖైరతాబాద్‌కు తరలింది. 1948 డిసెంబరు 1నాటికి 800వాట్ల శక్తితో షార్ట్ వేవ్, మీడియం వేవ్ లతో ఉన్న దక్కన్ రేడియోలో తెలుగు కార్యక్రమాలను పెంచేందుకు మాడపాటి హనుమంతరావు ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. 1950లో దక్కన్ రేడియో కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆలిండియా రేడియో హైదారాబాద్ కేంద్రంగా మార్చింది. ఇటీవలి కాలంలో టీవీ ఛానళ్ల ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎఫ్ ఎమ్ రేడియో ఛానళ్లు అన్ని వర్గాల వారికీ శ్రవణానందాన్ని కలిగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్టంలో ఆకాశవాణి ప్రసార కేంద్రాలు అనంతపురం, కడప, విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు, తిరుపతి, మార్కాపురంలలో తెలంగాణ రాష్టంలో హైదరాబాదు, కొత్తగూడెం, నిజామాబాదు, వరంగల్ , ఆదిలాబాదు తదితర నగరాల్లో పని చేస్తున్నాయి.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# ధాన్యం బకాయిలు విడుదల చేయండి

## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి వినతి

**విశ్వంభర, న్యూఢిల్లీ :** ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2014-15 ఖరీఫ్ కాలంలో అదనపు లెవీ సేకరణకు సంబంధించి రూ. 1468.94 కోట్ల రాయితీని పెండింగ్‌లో పెట్టారని కేంద్ర మంత్రికి వివరిస్తూ సంబంధిత పత్రాలన్నీ కేంద్రానికి సమర్పించిన విషయాన్ని తెలియజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన 89,987.730 మెట్రిక్ టన్నుల బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే 2021 మే నుంచి 2022 మార్చి వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్రానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కలిశారు. రాష్ట్రానికి బకాయిపడిన మొత్తాన్ని తక్షణం విడుదల చేయాలని కోరుతూ ఆ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు.





## లక్ష్య సాధనకు ఏకాగ్రత, పట్టుదలతో కృషి చేయాలి

### కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**విశ్వంభర, ఖమ్మం :** లక్ష్య సాధనకు ఏకాగ్రత పట్టుదలతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం(బీసీ స్టడీ సర్కిల్) లో గ్రూప్-1 ఉద్యోగార్థులకు చేపట్టిన ఉచిత శిక్షణా తరగతులకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు అనుసరించాల్సిన వ్యూహాన్ని గురించి కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడు శ్రమపై దృష్టి పెట్టాలని ఖచ్చితంగా ఫలితం వస్తుందని తెలిపారు. సిలబస్‌ను అనుసరించాలని ఆయన అన్నారు. ఒకరినొకరు సహకరించుకోవాలని తమకు తెలిసిన విషయాలు ఒకరినొకరు పంచుకోవాలని ఆయన అన్నారు. ఇంటిని చదువును బ్యాలన్స్ చేరుకోవాలన్నారు. నిరాశ నిస్పృహలకు లోనుకావద్దని ఆశావాహ దృక్పథంతో ముందుకు వెళ్లాలని అన్నారు. పరిస్థితులు లక్ష్య సాధనకు అడ్డంకులు కావని అవకాశాలను విజయాలుగా మలచుకోవాలని అన్నారు. చదువుతో పాటు అరగంట ఆటలు వ్యాయామానికి ఖచ్చితంగా కేటాయించాలన్నారు. మానసికంగా దృడంగా ఉండాలని సమస్యలకు ఆందోళన చెందకుండా పరిష్కారానికి యోచన చేయాలన్నారు. లక్ష్య సాధనకు వనరులు ఎప్పుడు అడ్డంకి కాదని ఆయన తెలిపారు. వనరులు సృష్టించుకోవాలని అవకాశాలు విజయానికి మెట్టుగా మలచుకోవాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ ఉద్యోగార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తదితరులు ఉన్నారు.



న్యూఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీప దాస్ మున్షీ..

## రాష్ట్రాలకు ప్రత్యేక హెూదాకు కావాల్సిన 5 అర్హతలు

**విశ్వంభర, న్యూఢిల్లీ :** బీహార్ కి ప్రత్యేక హెూదా గురించి ఈ రోజు పార్లమెంట్ లో జరిగిన బడ్జెట్ సమావేశంలో బీహార్ కి చెందిన జేడీయూ ఎంపీ మండల్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాష్ట్రాలకు ప్రత్యేక హెూదా పొందటానికి ఉండాల్సిన 5 అర్హతలు బీహార్ కు లేవని, ఈ విషయాన్ని ఇంటర్ మినీస్టీరియల్ గ్రూప్ నివేదిక ఇచ్చిందని లిఖిత పూర్వకంగా తెలియజేశారు. ఆ 5 అంశాలు ఇవే.. 1. పర్వతాలు, కఠినమైన భౌగోళిక స్వరూపం, 2. తక్కువ జనసాంద్రత, గిరిజన జనాభా అధికం, 3. పక్క దేశాలతో సరిహద్దు కలిగి ఉండడం, 4. ఆర్థిక, పారిశ్రామిక వెనుకబాటుతనం, 5. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉండటం. నేషనల్ డెవలప్మెంట్ కౌన్సిల్ సూచించిన ఈ అర్హతలు ఉన్న రాష్ట్రాలకే ప్రత్యేక హెూదా ఇస్తారు. తాజాగా బిహార్ కు ఈ అర్హతల్లేవని కేంద్రం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ కు కూడా హెూదా ఇచ్చే అవకాశం లేదని అనిపిస్తుంది.

## నిరుపేద వృద్ధుల కుటుంబానికి అండగా జయశంకర్ ఫౌండేషన్



**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని ఇప్పల బోరుకు చెందిన గంప గౌరయ్య ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఇంటి గోడ కూలిపోవడం జరిగింది. అతని భార్యకు గత ఐదు సంవత్సరాలకు ముందు పక్షవాతం వచ్చి ఒక కాలు ఒక చెయ్యి కూడా పని చేయట్లేదు. అప్పటి నుండి ఇంటి వద్దనే ఉంటుంది. ఒక ప్రమాదంలో గౌరయ్య ఎడమ చేయి కూడా కోల్పోయాడు. వారి పరిస్థితి దయనీయంగా మారడంతో అప్పటి నుండి గౌరయ్య కాళేశ్వరం టెంపుల్ వద్ద బిక్షాటన చేస్తూ అతని భార్యను పోషించుకుంటున్నాడు. ఇప్పుడు అతని ఇంటి గోడ కూలిపోవడంతో వృద్ధ దంపతులు కన్నీరు మున్నీరు కావడంతో విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి కూలిన గోడ కట్టుకోవడానికి 5,000 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది.

అలాగే మళ్లీ ఏమైనా అవ సరం ఉంటే నాకు ఫోన్ చెయ్యండి మీ కుటుం బానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌం డేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి పోషణ, యూత్ ఇన్చార్జ్ చింతకింది రాజు, నేన్నాల మల్లికార్జున్, సంతోష్, సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్‌లో పీఆర్వో స్పోర్ట్స్ షాపు ప్రారంభం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ ఎల్పీటీ మార్కెట్ రెండవ అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన పీఆర్వో స్పోర్ట్స్ షాపును సోమవారం ఉదయం ఎల్బీనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ మా సోదరుడు కరణ్‌గౌడ్ స్పోర్ట్స్ షాపును ఏర్పాటుచేయడం సంతోషకరమని, ఎల్బీనగర్ పరిసర ప్రాంత యువకులకు అందుబాటులో ఉండే విధంగా క్రికెట్, షటిల్, వాలీబాల్ వంటి ఆట వస్తువులు హెూల్ సేల్ రేట్లకే లభిస్తాయని తెలిపారు. ఎల్బీనగర్ పరిసర ప్రాంత యువకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంలో స్పోర్ట్స్ షాప్ యజమాని కరణ్ గౌడ్, రాఖీగౌడ్, విజయ్ పాల్గొన్నారు.



## మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

- తక్షణమే విద్యుత్, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు తీర్చాలి
- పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు, తుంగతుర్తి రవి

**విశ్వంభర, పీర్జాదిగూడ :** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లో నెలకొన్న, డ్రైనేజీ రోడ్లు, విద్యుత్, దోమల నివారణ, మొదలైన సమస్యలను పరిష్కరించాలని పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ప్రజావాణిలో మున్సిపల్ ఏఈ మరియు డిఈలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ గత రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు డ్రైనేజీలు పొంగడం, పలు కాలనీలలో లోవోల్టేజ్ విద్యుత్ సమస్యలు, వర్షాలకు కాలనీల రోడ్లు పూర్తిగా గుంతలు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఏఈకి, డిఈకి ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని తుంగతుర్తి రవి అన్నారు. అలాగే కార్పొరేషన్ వ్యాప్తంగా ఉన్న దోమల బెడద వలన ప్రజలు ఎలాంటి అనారోగ్య పరిస్థితులకు గురి కాకుండా రోజూ ఫాగ్గింగ్ చేయాలనీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాసారం నగేష్, ఎండీ మజర్, అమర్నాథ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలు కాలనీల అధ్యక్షులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## డిక్లరేషన్ ప్రకటించాలని ఓబీసీ మోర్చ డిమాండ్



**విశ్వంభర, ఘట్కేసర్ :** కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపల్ బీజేపీ ఓబీసీ మోర్చ అధ్యక్షుడు నల్లగొని కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఘట్కేసర్ ఎమ్మార్వోకు వినతి పత్రాన్ని సోమవారం అందజేసారు. భారతీయ జనతా పార్టీ ఘట్కేసర్ ఉమ్మడి మండలంలోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహించిన ఓబీసీ మోర్చ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ హాజరై రేవంత్ రెడ్డి సర్కార్ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, జిల్లా ఓబీ సీ మోర్చ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, మే డ్చల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు బాణావత్ శివకుమార్ నాయక్, రాష్ట్ర నాయకులు గొం గళ్ళ మహేష్, గుండ్ల ఆంజనేయులు, శ్రీరాము లు, బస్వరాజ్ గౌడ్, ఉమ్మడి మండలం బీజేపీ అధ్యక్షుడు సురేష్ నాయక్, హనుమాన్, పోచా రం మున్సిపల్ బీజేపీ పార్టీ జనరల్ సెక్రటరీ అజయ్ యాదవ్, పోచారం మున్సిపల్ బీజేపీ పార్టీ ఎస్సీ మోర్చ అధ్యక్షుడు రావుల శ్రీకాంత్, పోచారం మున్సిపల్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, గొంగళ్ళ బాలేష్, అశోక్, అనిల్, గుండె నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన



**విశ్వంభర, సరూర్ నగర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చ నందున రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కాశం వెంకటేశ్వర్లు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఏమైందన్నారు. గొల్ల కురుమలకు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని ఎకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారన్నారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదని మంది పడ్డారు. అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు, ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా, పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీ.సీ లకు ఇచ్చిన హామీ వారం రోజుల్లో చర్యలు ప్రారంభించకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్లలో ధర్నాలు నిరసనలు దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సంజయ్ గణతి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి కూతురు మురళి, ఎల్.బి నగర్ అసెంబ్లీ కన్వీనర్ పోల్కం ప్రశాంత్ ముదిరాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రాంపురం శ్రీనివాస్ కార్పొరేటర్ ప్రేమ్ మహెహ్శ్వర్ రెడ్డి, ఓబీసీ మోర్చా మహిళా కన్వీనర్ లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.



## అత్యవసర సమయాల్లో అధికారులను సంప్రదించాలి

### సురభి నవీన్

**విశ్వంభర, కోరుట్ల :** కోరుట్ల జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కోరుట్ల నియోజకవర్గం లోతట్టు ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ కోరారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదని నివాసయోగ్యం కానీ పురాతన ఇండ్ల పట్ల జాగ్రత్త వహించాలని, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే పొలాలకు వెళ్ళు రైతులు కూలీలు విష సర్పాల నుండి జాగ్రత్తగా ఉండాలని బావి మోటర్లు తడిసి ఉంటాయి కాబట్టి విద్యుత్ ఘాతానికి గురికాకుండా జాగ్రత్త వహించాలని కోరారు. అలాగే పిల్లలు పెద్దలు విద్యుత్ స్తంభాలను తాకరాదని, వర్షం పడు సమయంలో చెట్ల కిందికి వెళ్ళవద్దని, పిడుగుపాటుకు గుర య్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు వహించాలని నియోజకవర్గం ప్రజలకు విన్నవించారు.



బీఆర్ఎస్ నాయకులు శైలేంద్రచారి గారి మాతృమూర్తి తౌడోజు కనకమ్మ ఇటీవల మరణించడంతో వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



## నేత రాతను మార్చండి..
# చేనేతను ఆదుకోండి

**విశ్వంభర, నారాయణపూర్ :** నారాయణపురం మండల కేంద్రం పద్మశాలి చేనేత కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని, ప్రస్తుతం చేనేత కార్మికులు తయారు చేసిన చీరలు అమ్ముడు పోవడం లేదని చేనేత కార్మికులకు రావలసిన పథకాల గురించి త్రిబుల్ స్కీం, చేనేత మిత్ర, చేనేత బీమా కార్మికుల ఆర్థిక ఇబ్బందుల గురించి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి పద్మశాలి చేనేత కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ విషయాలపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు చెరుపల్లి లక్ష్మయ్య పద్మశాలి యువజన సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు విడం సాయి కిషోర్ నేత, సింగం కృష్ణ, గుర్రం సత్యనారాయణ, గంజి అంజయ్య, దోర్నాల కృష్ణ బాబు, సింగం భాస్కర్, సంగిశెట్టి నరేష్, చేనేత సహకార సంఘం ఇన్చార్జి కుర్రం సత్యనారాయణ, పద్మశాలి చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ఐఐటీ ఖరగ్ పూర్ సీటు సాధించిన
# చండూర్ సన్ షైన్ విద్యార్థి

**విశ్వంభర, చండూర్ :** భారత కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ప్రకటించిన ఐఐటీ–జేఈఈ మెయిన్స్ పరీక్షలలో నల్గొండ జిల్లా, చండూర్ మండల కేంద్రములోని సన్ షైన్ స్కూల్ విద్యార్థి కడారి వినయ్ దేశవ్యాప్తంగా 1604వ ర్యాంక్ తో ఐఐటీ ఖరగ్ పూర్ లో సీటు సాధించారు. ర్యాంక్ సాధించిన వినయ్ ని పాఠశాలలో కరెస్పాండెంట్ కోడి వెంకన్న, యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతు పాఠశాల స్థాయిలోనే ఐఐటీ విద్యను బోధించడం ద్వార ఇటువంటి ఫలితాలను సాధించవచ్చని, మారుమూల గ్రామీణ ప్రాంతమైన నెర్మట విద్యార్థి కడారి వినయ్ ని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని



విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ, ప్రిన్సిపాల్ రవికాంత్, తండ్రి కడారి నర్సింహా మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ
# కళ్యాణ మహోత్సవం

**విశ్వంభర, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట లోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త విగ్రహం వేణుగోపాల్ గౌడ్ దంపతులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా మంగళవారం అమ్మవారికి బోనాల ఉత్సవాలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త పేర్కొన్నారు. అధిక సంఖ్యలో బోనాల ఉత్సవాలలో మహిళలు ప్రజలు పాల్గొని విజయవంతం



చేయాల్సిందిగా కోరారు. కళ్యాణ మహోత్సవాన్ని అధిక సంఖ్యలో మహిళలు, ప్రజలు తిలకించారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేజ్ –3 లోనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎన్టీఆర్ నగర్ లోనీ ప్రజలు డ్రైనేజీ, నీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విషయం తెలుసుకొని సోమవారం ఉదయం బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ, మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కారం చేయాలి అని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ఎలక్ట్రికల్ పోల్స్ సంబంధిత విషయాలపై సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకురాగా వాటికి త్వరలో ప్రపోజల్ పెట్టి పూర్తి చేస్తామని వారికి హామీ ఇచ్చారు, కాలనీలో మిగతా ఏమైనా సమస్యలు ఉంటే డ్రైనేజీ గాని, రోడ్లు కానీ వాటి కూడా ప్రపోజల్ రెడీ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, న్యలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, సాజిద్, కొంద్ర శ్రీనివాస్, శ్యామ్ గుప్త, శ్రీమన్నారాయణ, వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, అనురాధ, స్వప్నరెడ్డి, శ్రీకాంత్ గౌడ్, అఫ్సర్, ఇస్మాయిల్, మహేందర్, కుమార్, దీపు, కౌసల్య, యాదగిరి, సోములు, నాయకులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## ఇంటింటా ఇన్నోవేటర్ ద్వారా
# నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

### జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**విశ్వంభర, మెట్పల్లి :** ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్–2024 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలనుండి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం ఐ.డీ.ఓ.సీ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి 6వ ఎడిషన్ – ఇంటింటా ఇన్నోవేటర్–2024 కార్యక్రమం పైన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడం జరుగుతుందని, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులు రూపొందించిన అన్ని వర్గాల ఆవిష్కర్తల నుండి ఆవిష్కరణలను స్వీకరించడం జరుగుతుందని, గొప్ప ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సంబంధిత ఆవిష్కర్తలకు అవార్డు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం జిల్లాకు ఒకరు చొప్పున యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమించి ఇన్నోవేషన్ మిత్రలుగా, 3 నెలల కాలానికి సమన్వయకర్తలుగా పనిచేసి జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు, గ్రామీణ ప్రజలతో సహా విభిన్న వాటాదారులతో నిమగ్నమై మారుమూల గ్రామాలకు కూడా ఆవిష్కరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ నూతన ఆవిష్కరణలను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తారని తెలిపారు.

ఆవిష్కర్తలు దరఖాస్తుల ను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 పంపించవ చ్చని, దరఖాస్తులో ఆవిష్కర్త పేరు, వయసు, ఫోటో, వృత్తి, చిరునామా, ఆవిష్కరణ పేరు, 100 పదాలతో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కరణ సంబంధిత హై రిజల్యూషన్ కలిగిన 4 ఫోటోలు, ఆవిష్కరణ విధులను ప్రదర్శించే 2 వీడియో లను ఆగస్టు 3వ తేదీలోగా పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి, సైన్స్ అధికారి రాజశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి నారాయణ, వెల్ఫేర్ అధికారి సాయిబాబా, మైనారిటీ అధికారి చిత్రు, ఈడీఓ మమత, జిల్లా ఇన్నోవేషన్ కో–ఆర్డినేటర్ జలంధర్ పాల్గొన్నారు.

## సునితకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యని
# విమర్శించే అర్హత లేదు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యపై అనుచితంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డినీ విమర్శిస్తూ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రెండు సార్లు కేసీఆర్ ఫోటోతో ఆలేరు ఎమ్మెల్యేగా గెలిచిన గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఎక్కడ అభివృద్ధి చేసిందో చూపించాలి అన్నారు. మహిళా గవర్నర్‌ను దుర్భాషలాడినప్పుడు విప్ గా, సాటి మహిళగా నోరు పారేసుకున్నప్పుడు ఎక్కడ పోయిందో మీ నైతికత అని విమర్శించారు. తెలంగాణ దొరల పాలన నుండి విముక్తి కలిగించి ప్రజా పాలన వైపు నడిపిస్తూ ప్రజా సంక్షేమం కోసం 6 గ్యారంటీలను అమలు పరుస్తూ రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతు భీమా లాంటి సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ ప్రజల మన్ననలను పొందుతూ ప్రజా పాలన నడిపిస్తున్న మా ప్రభుత్వంపై గాని మా నాయకులపై విమర్శలు చేయడం తగదన్నారు. అధికారం లేకపోయినా నియోజకవర్గ సంక్షేమం అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న ప్రజా నాయకులు ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య పట్ల అడ్డగోలుగా నోరు పారేసుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కందడి అనంత రెడ్డి, ముద్దసాని సిద్దులు, జన్నాయికోడే నగేష్, తండ శ్రీశైలం గౌడ్, బాశబోయిన పాపయ్య యాదవ్, కందాడి దశరథ రెడ్డి, పోతగానీ మల్లేశం, ఎలగందుల శ్రీను, లోడి మహేష్ పాల్గొన్నారు.



## మోర్పిరాలలో
## ఎయిమ్స్ వైద్య క్యాంపు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం మోర్పిరాల గ్రామంలో సోమవారం ఎయిమ్స్ ఆధ్వర్యంలో వైద్య క్యాంపు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. ఎయిమ్స్ వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మేరకు క్యాంపుకు హాజరైన జనాలకు మందులను అందచేసారు. ఈ క్యాంపులో ఎయిమ్స్ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, మోర్పిరాల, మోదుగుకుంట, చిన్నగూడెం, సింగారం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా గాయత్రీమాత మహాయజ్ఞం

**విశ్వంభర, బడంగ్‌పేట :** బడంగ్ పేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈరోజు శ్రీ గాయత్రీ మాత మహా యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో బడంగపెట్ ఆర్యవైశ్యులు అత్యధికంగా విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలో సంఘం అధ్యక్షులు తొణుపునూరి శ్రీనివాసు గుప్తా, దాచేపల్లి వెంకటేశ్వర్లు గుప్తా, రామ్మూర్తి గుప్తా, వీరబ్రహ్మ వెంకటేశ్వర్లు గుప్తా, సూర్యకాంత్ గుప్తా, బడంగ్‌పేట ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.





## ప్రతి ఒక్కరిచే
# మొక్కలు నాటించాలి

### ఎంపీడీవో రఫీక్ ఉన్నిసాబేగం

**విశ్వంభర, నారాయణఖేడ్ :** వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరిచే మొక్కలు నాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పెద్ద శంకరంపేట మండల ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా బేగం అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులతో మన మహోత్సవ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రామాలకు విధించిన టార్గెట్ ఆ గ్రామంలో మొక్కలు నాటించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని అందుకోసం గ్రామంలోని ప్రతి ఒక్కరికి మొక్కలు నాటడం, పెంచడంపై అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. గ్రామంలో నాటిన మొక్కలను పరిరక్షించడంతోపాటు కొత్తగా వన మహోత్సవ కార్యక్రమంలో గ్రామానికి ఉన్న టార్గెట్ ప్రకారం మొక్కలు నాటి వాటిని సంధించాల్సిన బాధ్యత కూడా నాటిన వారిదే అనే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు.



## సిద్ధి వినాయకకాలనీలో
# జలమయమైన రోడ్లు

**విశ్వంభర, హయత్ నగర్ :** నగరంలో గత రెండు మూడు రోజుల నుండి ఏడతెరపి లేకుండా పడుతున్న వర్షాల వల్ల హయత్ నగర్ డివిజన్ లోని సిద్ధి వినాయక కాలనీలో రోడ్లపై నీరు నిలిచి వాహనదారులకు, కాలనీ వాసులకు ఇబ్బందికరంగా మారిందని సమాచారం రావడంతో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీని సందర్శించి వెంటనే రోడ్ల పై నిలిచి ఉన్న నీటిని తొలగించడానికి చర్యలు చేపట్టాలని ఏఈ చంద్రశేఖర్ కి తెలపడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ నగర శివారులో ఉండడం వల్ల డివిజన్లోని చాలా కాలనీలో సీసీ రోడ్ల సదుపాయం లేకపోవడంతో వర్షాలు పడి రోడ్లన్నీ బురదతో చిత్తడిగా మారి డివిజన్ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా హయత్‌నగర్ డివిజన్ పై ప్రత్యేకమైన దృష్టి సారించి దశల వారీగా డివిజన్ లోని ప్రతి కాలనిలో వీలైనంత త్వరగా సీసీ రోడ్ల సదుపాయం ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకి విజ్ఞప్తి చెయడం జరిగింది. అదేవిధంగా వర్షాల వల్ల డివిజన్ వాసులకి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమకు సమాచారం అందిస్తే సకాలంలో స్పందించి సమస్యలు పరిష్కారం చేస్తానని తెలియజేశారు.

# బీసీలకు న్యాయం చేయాలి

## భాజపా ఆధ్వర్యంలో వినతి పత్రం



**విశ్వంభర, ఆమనగల్లు :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఈరోజు కడ్తాల్ మండల కేంద్రంలో బీసీలకు న్యాయం చేయాలని ఎమ్మార్వో ముంతాజ్ బేగంకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాలె శ్రీశైలం మాట్లాడతూ ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు స్థానిక రిజర్వేషన్ల కొరకు కుల గణన జరిపించి బీసీలకు 23 శాతం నుంచి 43 శాతం మధ్య స్థానిక బీసీలకు న్యాయం చేస్తాను అని, గొల్ల కురుమలకు గొర్ల పంపిని, బీసీ విద్యర్థులకు స్కాలర్షిప్, ఆర్థికంగా వెనుకబడిన బీసీ కుటుంబాలకు లక్ష రూపాయల కార్పొరేషన్ లోన్లను ఇస్తామని ఇచ్చిన మాట పై నిలబడాలని లేదంటే బీసీలు తిరగబడటం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మాన్య నాయక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటెకర్ భగీరథ్, మండల ప్రధాన కార్యదర్శులు దోనదుల మహేష్, జంగం వెంకటేష్, రాంచందర్ కేతావత్ రెడ్యా నాయక్, బాణావత్ శంకర్ నాయక్, వెంకటేష్ శ్రీను పాల్గొన్నారు.

# బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** రాష్ట్ర ఓబీసీ మోర్చ ఇచ్చిన పిలుపుమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణలో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల డిప్యూటీ తాసిల్దార్ కి వినతి పత్రం సమర్పించిన మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు శ్రీహరి. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, జిల్లా అధికార ప్రతినిధి బొబ్బలా ఇంద్రారెడ్డి, యువ మోర్చా మండల అధ్యక్షులు పైళ్ళ ప్రశాంత్, మండల కార్యదర్శిబూడిద నరసింహ, మండల యువ మోర్చా ప్రధాన కార్యదర్శి లోడి మహేష్, మండల ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి మధు, బూత్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, సహదేవ్, సీనియర్ నాయకులు ఆకుల సత్తయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు(ఎం) పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి పనులైన టువంటి ఆత్మకూర్ మెయిన్ రోడ్డు నుండి శివాలయం వరకు సెంటర్ లైటింగ్, డబుల్ రోడ్డు నిర్మాణం, నాయిబ్రహ్మణులకు(మంగలి) కమ్యూనిటీ భవనం నిర్మాణం, తిమ్మాపూర్ ఎక్స్ రోడ్డు నుండి వయా పెట్రోల్ బంక్ బొంత అంజయ్య ఇంటి వరకూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, తిమ్మాపూర్ ఎక్స్ రోడ్ నుండి వయా పెద్దమ్మ తల్లి గుడి, బస్ స్టాండ్, సబ్ – స్టేషన్ వరకు బీటి రోడ్డు నిర్మాణం, మార్కెట్ యార్డు నుండి కామునిగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణం, నల్ల నర్సయ్య ఇంటి నుండి వనం భారతమ్మ ఇంటి వరకూ సీసీ రోడ్డు నిర్మాణం, కొండపల్లి ముత్యాలు ఇంటి నుండి రజక వాడ వరకు సీసీ రోడ్డు నిర్మాణం, పిన్నింటి మోహన్ రెడ్డి ఇంటి నుండి ఎలిమినేటి యాదయ్య, పెద్దమ్మ గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణం మొదలగు వాటి కొరకు మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకీ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఇందుకు ఐలయ్య సానుకూలంగా స్పందిస్తూ అతి త్వరలో ఎస్డీఎఫ్ నిధుల నుండి పనులు మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాస లక్ష్మారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేష్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు ఎలగందుల శ్రీనివాస్, తొండల అనిల్ కుమార్, ఎలగంధుల సాయి పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో జాయింట్ కలెక్టర్ పర్యటన



**విశ్వంభర, భూపాలపల్లి :** భారీ వర్షాల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కే. వెంకటేశ్వర్లు కాళేశ్వరం పుష్కర ఘాటును సందర్శించి పలు సూచనలు చేశారు. రైతులు, ప్రజలు, జాలర్లు ఎవరు కూడా అత్యవసరం అయితేనే తప్ప బయటికి వెళ్లాలని, భక్తులు గోదావరిలో స్నానాలు చేయరాదని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పూస్కుపల్లి గ్రామ ప్రజలకు అవసరం అయితే పునరావాస కేంద్రానికి రావాలని అవగాహన కల్పించారు. ఇందులో మండల స్పెషల్ ఆఫీసర్ మరియు డీఎల్పీఓ వీరభద్రయ్య, తహశీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గిర్దవారి జగన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కవి, యోధుడు దాశరథి కృష్ణమాచార్య శత జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి నివాళులు అర్పించారు. ఢిల్లీ లోని అధికారిక నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి దాశరథి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు.



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈ రోజు ప్రజా వాణి కార్యక్రమంలో పాల్గొన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్, స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెసోళ్లు కళ్లు తెరువాలే

- పదిలక్షల క్యూసెక్కుల నీళ్లకు తట్టుకుని నిలబడ్డ కాళేశ్వరం
- బ్యారేజ్ బూచి చూపి లక్ష ఎకరాలను ఎండిపెట్టిండ్లు
- లక్ష కోట్ల అవినీతి జరిగిందని బదనాం చేసిండ్లు
- మూసీ నదికి మూడు సార్లు రేట్లు పెంచిన ఘనత కాంగ్రెస్‌దే
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



**విశ్వంభర, భూపాలపల్లి :** కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజ్ రెండు పిల్లర్లు కుంగిపోతే ప్రాజెక్టు పని అయిపోయిందని దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ పాలకులు కళ్లు తెరిచి చూడాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్ పూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ ను ఆయన సందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారీ వర్షాలు, వరదల కారణంగా ప్రాజెక్టులోకి బారీగా నీరు వస్తుందని, సుమారు పది లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేసి నీటిని వృధాగా పంపేస్తున్నారని ఆయన అన్నారు. ఈనాడు పది లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకుని నిలబడిన మేడిగడ్డ బ్యారేజ్ చరిత్ర సృష్టిస్తోందన్నారు. అలాంటి బ్యారేజ్ బూచి చూపి మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ సర్కార్‌ను బదనాం చేయాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేసిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోతే లక్ష కోట్ల అవినీతి జరిగిందని బదనాం చేశారని, అసలు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.83వేల కోట్లు ఖర్చు అయిందన్నారు. ఇందులో మూడు బ్యారేజ్‌లు, వేల కిలోమీటర్ల పైప్‌లైన్‌లు, టన్నెల్‌లు, సబ్ స్టేషన్‌లతో పాటు భూసేకరణ కూడా ఉందన్న విషయాన్ని గుర్తించకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజలకు ఈ విషయం తెలియకుండా కేవలం మేడిగడ్డ బరాజ్‌కే లక్ష కోట్లు ఖర్చు చేసినట్లు నమ్మించి ప్రజల ముందు దోషిగా నిలబెట్టే కుట్ర చేశారన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌లో 85 గేట్లు 86 పిల్లర్ల నిర్మాణానికి రూ.3600 కోట్లు ఖర్చు అయ్యాయని, అందులో రెండు పిల్లర్లకు క్రాక్ వస్తే లక్ష కోట్ల అవినీతి ఎక్కడ జరిగిందో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఈనాడు సీఎం రేవంత్‌రెడ్డి మూసీ నదిని ముందుకు తీసుకువచ్చి ఒకసారి రూ.50 వేల కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.70 వేల కోట్లు అని మ–రోసారి సీఎం ఏకంగా లక్షా యాభై వేల కోట్లు అంచనా అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని, ఆరు మాసాల పాలనలో ఒక నదికి మూడుసార్లు అంచనాను పెంచడం కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. బ్యారేజ్ బూచి చూపి లక్షల ఎకరాలను ఎండబెట్టారని, లక్షలాది మంది రైతులను రోడ్డున పడేశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మంథని నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం చేకూరలేదని ఎంతో మంది విమర్శలు చేశారని, కానీ ప్రాజెక్టును ఖాళీ చేసిన తర్వాత భూగర్భజలాలు అడుగంటి పోయి బోర్లు వేస్తే 800 ఫీట్లకు పడిపోయిన విషయాన్ని గుర్తించి ప్రాజెక్టు గొప్పతనం రైతులకు అర్థం అయిందని అన్నారు. తెలంగాణకు అన్నం పెట్టేది కాళేశ్వరం ప్రాజెక్టు అని ఆనాడు మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని ఆయన గుర్తు చేశారు. పది లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహంలో ఒక్క పిల్లరు కదలలేదనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరిచి చూడాలని ఆయన హితవు పలికారు.

# చెత్తలో వెళ్లిపోయిన 5 లక్షల డైమండ్ నెక్లెస్..

## ఆ తర్వాత ఏం జరిగింది..?



**విశ్వంభర, చెన్నై :** చెత్త కుప్పలో పారిశుద్ధ్య కార్మికులు రూ.5 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్‌ను వెతికి తీశారు. ఈ ఘటన చెన్నైలో వెలుగుచూసింది. ఇటీవల చెత్తను పారవేసే క్రమంలో డైమండ్ నెక్లెస్‌ను చెత్త డబ్బాలోకి విసిరివేశారు. ఆలస్యంగా నెక్లెస్ పోయిన విషయాన్ని గమనించారు. పారిశుద్ధ్య కార్మికులు నిశితంగా వెతకడం తో చెన్నైలో డైమండ్ నెక్లెస్ యజమానికి తిరిగి చేరింది. వివరాల్లోకి వెళ్తే నగరవాసి దేవరాజ్ అనే వ్యక్తి తన కుమార్తె వివాహం కోసం చేయించిన రూ.5 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్‌ను ప్రమాదవశాత్తు చెత్తతో పాటు డంప్ చేశాడు. ఆలస్యంగా డైమండ్ విషయాన్ని గ్రహించిన ఫ్యామిలీ మెంబర్స్ హుటాహుటిన చెన్నై కార్పొరేషన్‌ను ఆశ్రయించారు. అక్కడి అధికారులు వ్యర్థాల నిర్వహణ కోసం చెన్నై కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థకు విషయం చేరవేశారు. సీనియర్ అధికారులు కూడా రికవరీ ప్రయత్నాలను పర్యవేక్షించగా పారిశుద్ధ్య కార్మికులు సమీపంలోని అన్ని చెత్త డబ్బాలను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో ఓ చెత్త కుప్పలో పూలమా లలో చిక్కుకుపోయి డైమండ్ నెక్లెస్ కనిపించడంతో అందరూ ఊరట చెందారు. చెన్నై కార్పొరేషన్ అధికారులు ఆ డైమండ్ నెక్లెస్‌ను తిరిగి యజమానికి అందజేశారు. తన సమస్య చెప్పగానే సత్వరమే స్పందించి విలువైన నెక్లెస్‌ను వెతికి ఇచ్చిన అధికారులకు, పారిశుద్ధ్య కార్మికులకు దేవరాజ్ ధన్యవాదాలు తెలిపారు.

# ఉజ్జయిని మహాంకాళిని దర్శించుకున్న కార్పొరేటర్



**విశ్వంభర, అంబర్ పేట్ :** సికింద్రాబాద్ ఉజ్జయిని బోనాల జాతర సందర్భంగా సోమవారం ఉజ్జయిని మహాంకాళి అమ్మవారిని అంబర్ పేట్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాలు బాగా పడాలని, ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లడ్డు, నాగరాజు, బీఆర్ఎస్ పార్టీ అంబర్ పెట్ డివిజన్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, వినయ్, తపాల్గొన్నారు.



# టీసీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎట్టయ్య ముదిరాజ్

**విశ్వంభర, బషీర్ బాగ్ :** తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్జీవో రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షునిగా తెలంగాణ హైకోర్టు ప్రముఖ న్యాయవాది గద్దగూటి ఎట్టయ్య ముదిరాజ్ ను ఎన్నిక చేసినట్టు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ నేడు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. సోమవారం తెలంగాణ టీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా తెలంగాణ సిటిజన్ కౌన్సిల్లో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణ, శాంతి, మత సామరస్యం, జాతీయ సమైక్యత, న్యాయపరమైన శిబిరాలలో పాల్గొన్నారు. న్యాయ శాస్త్రంలో ఉస్మానియా యూనివర్సిటీ లో ఎల్ఎల్ఎం పీజీ పట్టా పొందారన్నారు. గతంలో రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 104 లో న్యాయ సేవలు అందించారు. సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ కంపెనీ వినియోగదారుల ఫోరం లేబర్ కోర్టు బ్యాంకింగ్, ట్రిబ్యునల్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ఎంతో ప్రఖ్యాతి పొందారనీ తెలిపారు. ప్రముఖ ప్రభుత్వ బ్యాంకింగ్ సంస్థలకు, ప్రైవేటు బ్యాంకింగ్ సంస్థలకు ప్యానల్ అడ్వైజర్ గా, న్యాయ సలహాదారులుగా ఉన్నారు. ప్రస్తుతం హిందూ ఆచార్య సభ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా, మహేశ్వరం మండల్ ముదిరాజ్ సంఘం ప్రచార కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ సభ్యులు ఎట్టయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.



## గోదావరికి పెరుగుతున్న వరద ప్రవాహం

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద గోదావరి ప్రాణహిత నదులకు వరద ప్రవాహం పెరుగుతుంది. మొదటి ప్రమాద హెచ్చరికను దాటి గోదావరి నదీ ప్రవహిస్తున్నది. ఈ క్షణమైన రెండవ ప్రమాద హెచ్చరికను చేరే అవకాశం ఉంది. ఈ వరద ప్రవాహం కారణంగా మేడిగడ్డ బ్యారేజీకి 10 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా మొత్తం నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. వరద పరిస్థితిని సమీక్షించేందుకు భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఎల్ఓ, ఎంపీడీవో ఎమ్మార్వో స్థానిక ఎస్సై కాళేశ్వరంను సందర్శించారు.

## స్మిత సభర్వాల్ వికలాంగ సమాజానికి క్షమాపణ చెప్పాలి



**విశ్వంభర, హైదరాబాద్ :** వికలాంగులకు ఐఏఎస్ లలో రిజర్వేషన్ ఎందుకు అంటూ ట్విట్టర్ లో వికలాంగులపై వెకిలి రాతలు రాసిన ఐఏఎస్ స్మిత సభర్వాల్ తక్షణమే వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని వికలాంగులకి క్షమాపణ చెప్పాలి అని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీ.ఎచ్.పీ.యస్) జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ్య గౌడ్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ అవ్వాలంటే దేహదారుఢ్యంతో ఏంపని ?, పరిపాలన వ్యవస్థ పట్ల అవగహన రాజ్యాంగ స్ఫూర్తి ఉంటె సరిపోతుంది, సివిల్స్ లో వికలాంగుల రిజర్వేషన్ ఎందుకు అంటూ అవహేళనగా మాట్లాడడం హేయమైన చర్య అని వారికి బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించే సామర్థ్యం లేదని మాట్లాడం వారిపట్ల తన అక్కస్సును తెలియపరుస్తుంది అని ఇప్పుడిప్పుడే వికలాంగుల సమాజం కూడా ఐఏఎస్ అధికారులుగా రానిస్తున్నారు అని, ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిగా మాట్లాడడం ముమ్మాటికీ వారిపట్ల నిర్లక్ష్యం, వివక్ష కనబరుస్తుంది అని ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో వారిపట్ల ఒక సంకుచిత స్వభావం ఏర్పడే అవకాశం ఉన్నదీ అని ఇప్పటికైనా స్మిత సభర్వాల్ వికలాంగుల సమాజానికి క్షమాపణలు చెప్పి తన అనుచిత వాక్యాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి ఈ అంశంపై స్పందించి రాజ్యాంగబద్దంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. లేకుంటే వికలాంగుల ఆత్మగౌరవం కోసం వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థపాక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తామని అన్నారు.

## చలివాగు ప్రాజెక్టు నుండి ఆయకట్టుకు నీటిని విడుదల



**విశ్వంభర భూపాలపల్లి :** భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండలం జోగంపల్లి గ్రామ శివారులోని మధ్యతరహా ప్రాజెక్ట్ చలివాగు నుండి సోమవారం సాయంత్రం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆయకట్టు కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ వర్షాకాలంలో రైతులకు ఆయకట్టు కాలువల ద్వారా నీటిని పంట పొలాలకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 3046 ఎకరాల పంట పొలాలకు నీటిని అందించడం జరుగుతుందన్నారు. ఈ కాలువల ద్వారా శాయంపేట మండలంలోని జోగంపల్లి, పెద్దకోడెపాక, కొప్పుల గ్రామాలతో పాటు కొత్తపల్లిగోరి మండలంలోని రాజక్కపల్లి, చిన్నకోడెపాక, దామరంచపల్లి, చెన్నాపూర్ గ్రామాల రైతులకు సాగు నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట శాయంపేట మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నేతలు, ఇరిగేషన్ ఈఈ, డీఈలు ఉన్నారు.

## గూడూరులో ఘనంగా బోనాల పండుగ



**విశ్వంభర, కొత్తూరు :** కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఇంటికి ఒక్క బోనం చొప్పున మహిళలు తీసుకవచ్చి బోనాలను ఊరేగింపుగా గ్రామ దేవతల వద్దకు తీసుకవచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాజా మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి రోగాలు రాకుండా చూడాలని అమ్మవార్లను మొక్కుకున్నానని ఆయన తెలిపారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు పండాలని. పశు, పక్షాదులు, పిల్లా పాపలు సల్లంగా ఉండాలని, గ్రామంలో ఎలాంటి రోగాలు రాకుండా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బ్యాగరి సత్తయ్య, మాజీ ఉప సర్పంచ్ దయానంద్ గుప్తా, మాజీ ఎంపీటీసీ మోడీ దర్శన్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దు గౌడ్, పెండ్లిమడుగు రాజు గౌడ్, గుండు ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేష్, మహేందర్ రెడ్డి, బోకుల రాజు, నరసింహారెడ్డి, శ్రీను, శివరాజ్, జయేందర్ రెడ్డి, పాపిరెడ్డి, దామోదర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీరాములు, రాములు గౌడ్, సిద్దు, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మెట్పల్లి పురపాలక సంఘం సాధారణ సమావేశం




**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి కౌన్సిల్ సమావేశం మందిరం నందు మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి రణవేణి సుజాత సత్యనారాయణ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో 14వ వార్డు కౌన్సిలర్ మరి పోచయ్య మాట్లాడుతూ పట్టణంలో గల పెద్ద చెరువు డ్రైన్ పనులు చేయగలరని పట్టణంలోని హాస్పిటల్స్ వ్యర్థాలను చెరువులో వెయ్యకుండా హాస్పిటల్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. 18వ వార్డ్ కౌన్సిలర్ చెట్లపల్లి మీనా మాట్లాడుతూ పట్టణంలో విక్రయిస్తున్న మాంసాహార విక్రయాలను పట్టణ శివారులో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అలాగే మహాలక్ష్మి టెంపుల్ వద్ద సుందరీకరణ కొరకు పనులు చేపట్టాలని పెద్ద డ్రైనేజీ పనులను త్వరగతిన పూర్తి చేయాలని అన్నారు. 16వ వార్డు 20వ వార్డు 26 వ వార్డు కౌన్సిలర్లు మురుగు కాలువల గురించి మిషన్ భగీరథ నీరు గురించి గ్రంథాలయం దగ్గర ఉన్న ట్రాన్స్ఫార్మర్ తరలింపు గురించి చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనసభ్యులు కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ గౌరవ కౌన్సిల్స్ తెలిపిన వారి వారి సమస్యలను త్వరగతిన పూర్తి చేసి సమస్యలను పరిష్కరిస్తానని పట్టణంలోని పలు వార్డులలో సంబంధిత అధికారులతో ప్రతిరోజు పర్యటించి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని సభాముఖంగా హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో పని చేసే బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ చైర్పర్సన్ సుజాత సత్యనారాయణ కౌన్సిల్ సభ్యులు కలసి సభాముఖంగా సన్మానం చేశారు. ఇట్టి సాధారణ సమావేశంలో ప్రవేశ పెట్టిన 27 అంశాలను సభ్యులందరూ అంశాల వారీగా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భూ సేకరణ పనులు వేగవంతం చేయాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి :** కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు కోసం భూసేకరణ పనులను వేగవంతం చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు భూసేకరణ, దుబ్బపల్లి గ్రామానికి ఆర్ ఆర్ ప్యాకేజీ, కేటీపీపీ భూముల సరిహద్దులు ఏర్పాటు, తాడిచర్ల ఆర్ ఆర్ ప్యాకేజీ తదితర అంశాలపై జెన్కో, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాడిచర్ల నుండి ఘనపురం మండలంలోని చెల్పూరు నుండి కేటీపీపీకి 17 కిలోమీటర్లకు 133 ఎకరాల భూమి సేకరణ చేయాల్సి ఉండగా సుమారు 14 కిలోమీటర్లు భూసేకరణ జరిగిందని భూనిర్వాసితులకు పరిహారం అందించామని మిగిలిన 3.5 కిలో మీటర్ల వరకు భూసేకరణను వేగవంతం చేసేందుకు సిపల్లి, కొంపల్లి గ్రామాల మీదుగా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేయాల్సి ఉన్నందున నిర్వాసితులతో మాట్లాడి భూసేకరణ జరపాలని తెలిపారు. కాకతీయ లాంగ్ వాల్ ప్రాజెక్ట్ నుండి కేటీపీపీ వరకు ఏర్పాటు చేయబోయే మరొక కన్వేయర్ బెల్ట్ కోసం సేకరించిన భూమి ఆక్రమణ కాకుండా సర్వే నిర్వహించి భూములకు సరిహద్దులను ఏర్పాటు చేయాలని అన్నారు. బ్యాలెన్స్ అసైండ్ భూములకు ఎంజాయ్మెంట్ సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కేటీపీపీ నిర్మాణంలో భూములు కోల్పోయిన దుబ్బపల్లి గ్రామాన్ని ఆర్ ఆర్ ప్యాకేజీ కింద తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్ ఆర్ ప్యాకేజీ కింద తాడిచర్ల భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలు బదులుగా పరిహారం అందించడానికి చర్యలు చేపట్టాలని, కాపురం గ్రామం వద్ద అబాది- భూమి 6.31 ఎకరాలు కోసం అవార్డు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, కేటీపీపీ సివిల్ ఇంజనీర్ రామ ముత్యాలరావు పాల్గొన్నారు.

## ఐక్యత శంకర నేత్రాలయ వారి ఉచిత కంటి వైద్యశిబిరం



**విశ్వంభర, ఆమనగల్లు :** ఐక్యత ఫౌండేషన్ శంకర నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో వెల్దండ మండల కేంద్రంలోని ఏవీ ఆర్ ఫంక్షన్ హాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గత మూడు రోజుల నుండి కొనసాగుతుంది. కంటి వైద్య శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేంద్రరెడ్డి సందర్శించి రోగులకు కంటి అద్దాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ నిరుపేద ప్రజల కోసం ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నేత్రాలయ వారిని అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇక్కడ ముఖ్యంగా కంటి శుక్లాలకు సర్జరీలు చేయడం జరుగుతుంది. ఈ కంటి శుక్లాల సర్జరీ ఖర్చుతో కూడుకున్నది, ఆర్థిక ఇబ్బందులవలన చాలామంది కంటి సమస్యలతో బాధపడుతున్నవారు సర్జరీ చేయించుకోలేని పరిస్థితులలో ఉన్నారు వారందరిని దృష్టిలో ఉంచుకొని ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈనెల 27 వరకు ఈశిబిరం కొనసాగుతుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్ గౌడ్, దళపతి గౌడ్, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, పంతునాయక్, నరేందర్ గౌడ్, యువజన నాయకులు శ్రీనివాస రెడ్డి, మల్లయ్య, రమేష్ నా యక్, అభినన్ రెడ్డి, యూసఫ్ బాబా, గణేష్, మల్లేష్, శేఖర్, శ్రీపతి, శ్రీనునాయక్, శివ, రఘు, హస్సన్, లక్ష్మణ్, శ్రీను, కల్యాణ్ పాల్గొన్నారు.

## కాలేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ ప్రాజెక్టుకు వరద నీరు అధికంగా వచ్చే చేరుతుంది. 8,68,850 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా మొత్తం నీటిని అన్ని గేట్లు ఓపెన్ చేసి కిందికి విడుదల చేస్తున్నారు. కాలేశ్వరం వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. నదీ ప్రవాహం 12.25 మీటర్లకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. స్థానిక ఎమ్మార్వో ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్సై చక్రపాణి, గ్రామ కార్యదర్శి సత్యనారాయణలు నిరంతరం వరద నీటిని పర్యవేక్షిస్తూ భక్తుల స్నానాలను నిలిపివేశారు. గోదావరి నది ఒడ్డున ఉన్న షాపులను ఖాళీ చేయించారు. మహారాష్ట్రలోని భారీ వర్షాల కారణంగా ప్రాణహిత నదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నదికి కూడా వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో త్రివేణి సంగమం పుష్కర ఘాటు వద్ద మెట్లన్ని మునిగి వరద ప్రవాహం ఒడ్డు పైకి చేరుతుంది. దీంతో స్థానిక పోలీసులు నది వద్ద కాపలాగా ఉంటూ భక్తులను, ప్రజలను నది వద్దకు రాకుండా చూస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్వో, ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు భక్తులను అనుమతించట్లేదని తెలిపారు. ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన సహాయక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ఉన్నందువలన లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్టు తెలిపారు.



## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**విశ్వంభర, చింతపల్లి :** అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చింతపల్లి గ్రామంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన పేర్ల జంగారెడ్డి కుమారుడు వెంకట్ రెడ్డి (51) మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకు ఎదురుగా ఒక డబ్బా వేసుకుని మోటార్ మెకానిక్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అప్పుల బాధతో తీవ్ర మనోవేదనకు గురి అయి తన మెకానిక్ షాపులో ఆదివారం రాత్రి మోటార్ వైరుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రోజు ఉదయం అతని భార్య పేర్ల రాధా ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ బి.యాదయ్య తెలిపారు.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహా ఆవిష్కరణ

**విశ్వంభర, వెల్దండ :** నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహా ఆవిష్కరణ సందర్భంగా మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, ఎక్సైజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావుకు మండల గౌడ సంఘం అధ్యక్షుడు మట్ట వెంకటయ్య గౌడ్ సత్కారం చేశారు. వారితో పాటు ప్రధాన కార్యదర్శి మట్ట విష్ణు గౌడ్ వెల్దండ సీనియర్ పాత్రికేయులు నాగరాజు గౌడ్, శంకర్ పాల్గొన్నారు.



## ఈవ్ టీజింగ్ కేసు నమోదు

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మండల కేంద్రంలో ఈవ్ టీజింగ్ చేస్తున్న ముగ్గురు ఆకతాయిలను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ఆమనగల్ పట్టణ బస్-స్టాండ్ సమీపంలో స్కూల్ విద్యార్థులను ముగ్గురు ఆకతాయిలు గత వారం రోజుల నుండి ఈవ్ టీజింగ్ చేస్తునారు. సమాచారం మేరకు అట్టి ఆకతాయులను సోమవారం సాయంత్రం ఆధుపులో తీసుకొని వారిపైన కేసులు నమోదు చేసిన అనంతరం, వారి తల్లితండ్రులను పోలీసు స్టేషన్కు పిలిపించి కౌన్సెల్లింగ్ ఇచ్చి పంపటం జరగింది. ఇక మీదట ఎవరైనా ఇలాంటి ఆకతాయి పనులకు పాల్పడిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.




# రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వాన్ని నిశ్శబ్దం చేసేందుకు ప్రయత్నించారు: మోదీ

**విశ్వంభర, దిల్లీ :** కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన తరువాత ఎన్డీయే సర్కార్ తొలి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టబోతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ (PM Modi) మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు విలువైన సమయాన్ని ప్రతిపక్షాలు వృథా చేస్తున్నాయని ఆయన విమర్శించారు. "నేను బరువెక్కిన హృదయంతో చెబుతున్నా... కొందరు ఎంపీలు, ఇతరులను తమ నియోజకవర్గ సమస్యలపై సభలో మాట్లాడే సమయం ఇవ్వకుండా చేస్తున్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలి. సభలో నిరసనలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధంగా నిశ్శబ్దం చేసేందుకు ప్రయత్నించారు'' అని మోదీ అన్నారు. ''ఇదివరకు జరిగిన సభల్లో రెండున్నర గంటలు నాపై ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాల్లో ఇలాంటి వ్యాఖ్యలకు తావుండదు. వీటన్నింటినీ దేశం నిశితంగా పరిశీలిస్తోంది. విపక్షాలు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలి. కనీసం ఈ సమావేశాలైనా సజావుగా సాగుతాయని ఆశిస్తున్నా. 2014 తర్వాత కొంతమంది ఎంపీలు ఒకసారి, మరికొందరు రెండోసారి గెలిచారు'' అని అన్నారు. '' కానీ.. విపక్షాల అరుపుల మధ్య వారిలో చాలా మంది వారి సమస్యలను సభాసాక్షిగా వినిపించలేకపోయారు. ఇక నుంచైనా సమావేశాలను సజావుగా సాగనిస్తూ.. ప్రజల ఆకాంక్షలను సభలో వినిపించనివ్వండి. 60 సంవత్సరాల తరువాత వరుసగా మూడు సార్లు ఓ పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మూడోసారి అధికారం చేపట్టాక తొలి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం'' అని మోదీ వ్యాఖ్యానించారు. ''సుపరిపాలనకు ఈ బడ్జెట్ ముఖ్యమైనది. రాబోయే 5 ఏళ్లకు ఇది దిశానిర్దేశం చేస్తుంది. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి బలమైన పునాది అవుతుంది. గత మూడేళ్లలో దేశం 8 శాతం ఆర్థిక వృద్ధిని సాధించింది. దేశంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం ఉంది. అందుకు తగినట్లు వేల సంఖ్యలో కంపెనీలు భారత్‌కి వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయ్. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాయ్" అని మోదీ పేర్కొన్నారు.

# ఫిల్మ్ పోస్టర్‌తో జైషే వీడియో...

## షేర్ చేయొద్దంటూ పోలీసులు వార్నింగ్




**విశ్వంభర, శ్రీనగర్:** బాలీవుడ్ చిత్రం 'ఫాంటమ్స్ పోస్టర్‌తో ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ సోమవారం విడుదల చేసిన ఓ ఆడియోపై జమ్మూకశ్మీర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ వీడియోను ఎవరూ షేర్ చేయవద్దంటూ ప్రజలకు అదేశాలు జారీ చేశారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA)లోని సెక్షన్ 13, 18 కింద నేరమవుతుందని హెచ్చరించింది. జైషే ఉగ్రవాద సంస్థ నుంచి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు 5 నిమిషాల 55 నిమిషాల నిడివి గల వీడియో విడుదలైందని జేకే పోలీసులు సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో ప్రజలను అప్రమత్తం చేశారు. ఎవరూ ఈ వీడియోను ఒకరికొకరు షేర్ చేసుకోరాదని, సంబంధిత వీడియో అందినప్పుడు టెలిఫోన్ నెంబర్, డాటా, అందిన సమయం తమకు తెలియజేయాలని, ఆ సమాచారాన్ని పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు వెంటనే తమ పై అధికారుల దృష్టికి తప్పనిసరిగా తీసుకువెళ్లాలని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. జమ్మూలో ఇటీవల కాలంలో ఉగ్రదాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

# అధ్యక్షురాలిగా కమల గెలుపు కోసం

## భారత్‌లో బంధువుల ప్రత్యేక పూజలు





**విశ్వంభర, అంతర్జాతీయం:** డెమొక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా వైదొలుగుతున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించడం వల్ల ఆ స్థానాన్ని దక్కించుకునేదెవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్నికల రేసు నుంచి తప్పుకున్న బైడెన్, వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ పేరును ప్రతిపాదించారు. దీంతో కమల తల్లి శ్యామల గోపాలన్ స్వగ్రామమైన తమిళనాడులోని తులసేంద్రపురంలో ఆనందం వెల్లివిరిసింది. ఆమె బంధువులు స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈటీవీ భారత్‌తో మాట్లాడారు. "2019లో అమెరికా ఉపాధ్యక్షురాలిగా కమలా హారిస్ ఎన్నికైనప్పుడు పండుగలా జరుపుకొన్నాం. ఈ ఎన్నికల్లోనూ ఆమె విజయం సాధించడం ఖాయం. అగ్రరాజ్య అధ్యక్షురాలైన తర్వాత ఆమె భారతదేశ అభివృద్ధికి పాటుపడలాన్నదే మా కోరిక" అని కమలా హారిస్ బంధువు ఆనంద్ తెలిపారు. "అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ పేరును ప్రతిపాదించడం సంతోషంగా ఉంది. ఆమె తప్పకుండా గెలుస్తుంది. కమల విజయం కోసం దేవుడిని ప్రార్థిస్తున్నాం. ఎన్నికల్లో గెలిచి భారత్‌కు రావాలి. మన దేశ అభివృద్ధికి తోడ్పడాలి" అని మరో బంధువు రూపదర్శిని అన్నారు.

**కొన్నేళ్ల క్రితం ఆ ఆలయానికి విరాళం**

అయితే కమలా హారిస్ కుటుంబం ఇప్పటికీ తమ మూలాలు ఉన్న తులసేంద్రపురం గ్రామంతో సన్నిహితంగా ఉంటోంది. ఆమె తల్లి శ్యామల సోదరి చెన్నైలో ఉంటున్నారు. కొంతమంది బంధువులు తులసేంద్రపురంలో నివసిస్తున్నారు. అలాగే ఆమె పూర్వీకుల గుడి అయిన ధర్మశాస్త దేవాలయం తులసేంద్రపురంలో ఉంది. కమలా హారిస్ కొన్నేళ్ల క్రితం ఆ ఆలయానికి భూరి విరాళం ఇచ్చారు. ఆలయ శాసనంలో ఆ వివరాలు కూడా నమోదు కావడం గమనార్హం. అయితే కమలా హారిస్ అమెరికా తొలి మహిళా ఉపాధ్యక్షురాలు. మొదటి నల్లజాతి, దక్షిణాసియా సంతతికి చెందిన తొలి వైస్ ప్రెసిడెంట్ కూడా ఆమే. 59 ఏళ్ల కమలా హారిస్ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ఆమోదం లభిస్తే అమెరికా చరిత్రలోనే కీలక నిర్ణయం కానుంది. ఓ ప్రధాన పార్టీ అధ్యక్ష అభ్యర్థి రేసులో నిలవనున్న తొలి ఆసియా సంతతి మహిళగా చరిత్రకెక్కనుంది.

# ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనే వీలు

**విశ్వంభర, దిల్లీ :**

ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యక్రమాల్లో పాల్గొనడంపై దశాబ్దాలుగా ఉన్న నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయడాన్ని ఆర్ఎస్ఎస్ ప్రశంసించింది. ఈ నిర్ణయం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందని అభిప్రాయపడింది. గతంలో ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని మునుపటి పాలకులు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపించింది.

"ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఉన్న నిషేధాన్ని కేంద్రం ఎత్తివేయడం సరైన చర్య. ఈ నిర్ణయం భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఆర్ఎస్ఎస్ గత 99 ఏళ్లుగా దేశ పునర్నిర్మాణం, సమాజ సేవలో చురుకుగా పాల్గొంది. జాతీయ భద్రత, ప్రకృతి విపత్తుల సమయంలో సమాజాన్ని ముందుకు తీసుకెళ్లడంలో సంఘ్ సహకారం అందించింది. కానీ, మునుపటి పాలకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొకుండా నిషేధం విధించారు." అని ఆర్ఎస్ఎస్ అధికార ప్రతినిధి సునీల్ అంబేకర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

**కాంగ్రెస్ ఫైర్**

మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనడంపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తూ కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ చర్య ప్రభుత్వ ఉద్యోగుల తటస్థ భావజాలానికి సవాలుగా మారుతుందని ఆరోపించింది. 1947లో జాతీయ జెండాను దేశం స్వీకరించిందని, అయితే ఆర్ఎస్ఎస్ మాత్రం త్రివర్ణ పతాకాన్ని వ్యతిరేకించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. "మహాత్ముడి హత్య తర్వాత 1948 ఫిబ్రవరి 4న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని 1966లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. 58 ఏళ్ల తర్వాత మోదీ ఆ నిషేధాన్ని ఎత్తివేశారు. అన్ని రాజ్యాంగ, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను సంస్థాగతంగా స్వాధీనం చేసుకునేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ఎలా వాడుకుంటుందో మాకు తెలుసు. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిషేధాన్ని ఎత్తివేయడం ద్వారా మోదీ సర్కార్ ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగులపై సైద్ధాంతిక ప్రాతిపదికన రాజకీయం చేయాలని చూస్తున్నారు. రాజ్యాంగం మార్చాలనే ఆలోచనను ప్రజలు ఓడించడం వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉంటుంది. మోదీ సర్కార్ రాజ్యాంగబద్ధ సంస్థలపై నియంత్రణ సాధించడానికి, రాజ్యాంగాన్ని మార్చేందుకు తన ప్రయత్నాలను కొనసాగిస్తోంది. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలు తమ ప్రయత్నాలను కొనసాగిస్తాయి."

## దశాబ్దాల నాటి బ్యాన్ ఎత్తివేతపై కాంగ్రెస్ ఫైర్



**-మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు**

"గాంధీజీ హత్య తర్వాత 1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించారు. మంచి ప్రవర్తన హామీతో ఆ నిషేధాన్ని తొలగించారు. కానీ 1966లో మళ్లీ ఆ నిషేధం అమల్లోకి వచ్చింది." అని వ్యాఖ్యానించారు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్. జూన్ 4(ఎన్నికల ఫలితాలు) తర్వాత ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. వాజ్ పేయి హయాంలో కూడా ఉన్న నిషేధాన్ని ఎత్తివేశారని ఎక్స్ వేదికగా కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

**'కాంగ్రెస్‌కు బుజ్జగింపు రాజకీయాలపై ఆసక్తి'**

ఆర్ఎస్ ఎస్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్వాగతించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనవచ్చని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు రాజకీయాలపై మాత్రమే ఆసక్తి చూపుతుందని విమర్శించారు. హిందూ సమాజం పట్ల వారి వైఖరి చాలా ప్రతికూలంగా ఉందని ఆరోపించారు. "రాజకీయ కారణాలతో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడంపై కాంగ్రెస్ నిషేధం విధించింది. ఆర్ఎస్ఎస్ దేశభక్తి కలిగిన సంస్థ. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలందరూ దేశభక్తితో ఉంటారు. సామాజిక సంస్థలపై కాంగ్రెస్ పార్టీకి ప్రతికూల ఆలోచనలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి దేశ వ్యతిరేక భావజాలం ఉంటుంది. ఆర్ఎస్ఎస్‌లో కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొనేలా సడలింపులు ఇచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు." అని పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు.

# 'నీట్-యూజీ'పై విపక్షాలది మొసలి కన్నీరు

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**విశ్వంభర, ఢిల్లీ :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పేపర్ లీకేజ్ అంశంపై రాహుల్ గాంధీ, విపక్షాలు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఇదిలా ఉంటే.. గత యూపీఏ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్‌లోని అఖిలేష్ యాదవ్ ప్రభుత్వ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలకు సంబంధించి గ్రౌండ్ లెవల్ విచారణ జరుగుతోన్న సంగతి తెలిసిందే. లోక్‌సభ వేదికగా నీట్ యూజీకి సంబంధించిన వివాదంపై సోమవారం విపక్షాలు.. అధికార పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించాయి. పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు దాడి చేశాయి. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "దేశంలో పరీక్షా విధానంలో ఎన్నో లోటుపాట్లు ఉన్నాయని.. ఇక ఈ అంశంపై తనను తప్ప..



ఇతరులను నిందిస్తున్నారంటూ" కేంద్ర విద్యాశాఖ మంత్రిని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. దీనిపై తాజాగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యాసంస్థల్లో అన్యాయమైన పద్ధతులను నిరోధించేందుకు ఎందుకని చర్యలు తీసుకోలేదు.? అన్యాయమైన పద్ధతుల నిషేధ బిల్లు, 2010ను కూడా నిరోధించడంలో ఎందుకు విఫలమైందని.? కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రధాన్ మండిపడ్డారు. ఈ మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన ట్విట్టర్‌లో ఓ పోస్ట్ చేశారు. అక్రమ పద్ధతుల నిషేధ బిల్లు 2010తో సహా విద్యా సంస్థల్లో అన్యాయమైన పద్ధతులను నిరోధించేందుకు సంబంధించిన బిల్లులను అమలు చేయడంలో యూపీఏ ప్రభుత్వం ఎందుకు విఫలమైందో కాంగ్రెస్ వివరించాలి. ఏయే కారణాల వల్ల అక్రమాలను అరికట్టేందుకు ఉపయోగపడే ఈ చట్టాన్ని తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీ ఎందుకు నిరాకరించిందో ప్రతిపక్ష నేత చెప్పగలరా? అలాగే గత ఏడేళ్లలో పేపర్ లీకేజీకి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. నీట్ యూజీకి సంబంధించి అవకతవకలు జరిగాయన్న అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతామని, ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తామని రాహుల్ గాంధీ అంతకుముందు చెప్పిన సంగతి తెలిసిందే.



# కేంద్రం మెడలు వంచైనా ప్రత్యేక హోదా సాధిస్తాం

## ఆర్జేడీ నేత మనోజ్ ఝా

**విశ్వంభర, బిహార్ :** కేంద్రంతో పోరాడి బిహార్‌కు ప్రత్యేక హోదా సాధిస్తామని ఆర్జేడీ నేత మనోజ్ ఝా అన్నారు. తాము రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్నామని చెప్పారు. ప్రత్యేక హోదా సాధించడంలో బిహార్ సీఎం నితీష్ కుమార్ విఫలమయ్యారని ఆరోపించారు. కేవలం ఒక సంతకంతో ప్రత్యేక హోదా లభిస్తుందని, కానీ కేంద్ర ప్రభుత్వం హోదా ఇవ్వాలని కోరుకోవడం లేదని మండిపడ్డారు. కాగా, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ఎన్డీయే కూటమిలో ముఖ్య పాత్ర పోషిస్తున్న జేడీయూకి గట్టి షాక్ తగిలింది. నితీశ్ కుమార్ పాలిత రాష్ట్రం బీహార్‌కు ప్రత్యేక హోదా అంశంపై కేంద్రం స్పష్టతనిచ్చింది. అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని పార్లమెంట్ వేదికగా వెల్లడించింది. ఈ మేరకు లోక్‌సభలో జేడీయూ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్డీయే కూటమి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు జేడీయూ కూడా కీలకంగా మారిన విషయం తెలిసిందే. 12 మంది ఎంపీలతో కూటమిలో మూడో అతిపెద్ద పార్టీగా ఉంది. దీంతో జేడీయూ అధినేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్ తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ఈ డీల్‌తోనే ఎన్డీయే కూటమిలో జేడీయూ భాగమైందంటూ రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరిగింది. ప్రత్యేక హోదా లేని పక్షంలో ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేసింది.

# భారత్ సరిహద్దుల్లో పాక్ 'ఉగ్ర' పన్నాగం



**విశ్వంభర, శ్రీనగర్:** భారత్ సరిహద్దుల్లో దాయాది దేశం పాకిస్థాన్ (Pakistan) రెచ్చిపోతోంది. ఎల్ఓసీ (Loc) వెంబడి భారత భూభాగంలోకి దగ్గరుండి మరీ సాయుధ ఉగ్రవాదులను పంపిస్తోంది. వీరికి పాక్ సైనికులు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు ఇటీవల వెలుగుచూడగా, తాజాగా మరికొన్ని ఫోటోలు వెలుగుచూశాయి. మారణాయుధాలతో ఉన్న సుమారు ఐదుగురు ఉగ్రవాదులు, వీరికి గార్డుగా పాకిస్థాన్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ (SSG) కమండో జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో వేచి ఉండటం ఇందులో కనిపిస్తోంది. భారత సైన్యం కన్నుకప్పి ఎక్కడి నుంచి భారత భూభాగంలోకి చొరబడాలనే దానిపై పాక్ సైనికులు ముందుగానే ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నారని ఈ ఫోటోల్లో స్పష్టమవుతోంది.

**జమ్మూలో పెరుగుతున్న ఉగ్రదాడులు**

జమ్మూ ప్రాంతంలో దశాబ్దాల ఉగ్రవాదాన్ని భారత భద్రతా బలగాలు తుడిచిపెట్టడంతో 20052021 మధ్య చాలామటుకు ప్రశాంత వాతావరణం నెలకొంది. అయితే గత నెలరోజులుగా ఉగ్రదాడులు మళ్లీ పెరుగుతున్నాయి. ఇటీవల యాత్రికుల బస్సుపై ఉగ్రవాదులు జరిపిన దాడులో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 40 మంది గాయపడ్డారు. జంట సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరిలో గత అక్టోబర్‌లో తిరిగి ఉగ్రవాద కార్యకలాపాలు వెలుగుచూశాయి. రియాసి, కథువా, దోడాల్లో సెక్యూరిటీ పోస్టులపై దాడులు చోటుచేసుకున్నాయి. 2021 నుంచి జమ్మూ రీజియన్‌లో జరిగిన ఉగ్ర సంబంధిత ఘటనల్లో 52 మంది భద్రతా సిబ్బందితో సహా 70 మందికి పైగా ప్రామాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది ఆర్మీకి చెందిన వారే ఉన్నారు.

# సుప్రీంకోర్టులో యూపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

**విశ్వంభర, ఢిల్లీ :** కన్వర్ యాత్ర - నేమ్ ప్లేట్ వివాదం కేసులో సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఉత్తరప్రదేశ్ సహా మరో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయంపై కోర్టు మధ్యంతర స్టే విధించింది. దుకాణాలపై దుకాణదారులు పేర్లు, గుర్తింపులను వెల్లడించాల్సిన అవసరం లేదని కోర్టు పేర్కొంది. హోటళ్ల నిర్వాహకులు నేమ్ ప్లేట్లు ప్రదర్శించాలనే నిబంధనపై స్టే విధించిన సుప్రీంకోర్టు.. యాజమానులు, విక్రయదారుల పేర్లను వెల్లడించమని బలవంతం చేయొద్దని ప్రభుత్వాలకు కోర్టు సూచించింది. దుకాణందారుడు వారి దుకాణంలో ఎలాంటి ఆహారం విక్రయిస్తున్నాడో మాత్రమే ప్రదర్శించాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది. దీనిపై తదుపరి విచారణను శుక్రవారానికి కోర్టు వాయిదా వేసింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు శుక్రవారంలోగా తమ సమాధానాలను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. కన్వర్ యాత్ర సందర్భంగా కన్వర్ మార్గంలోని దుకాణాలపై నేమ్ ప్లేట్ లను అమర్చాలని యూపీ ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిపిందే. ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు కూడా ఇదే విధమైన సూచనలు జారీ చేశాయి. ఒకవైపు ప్రతిపక్షాలు ప్రభుత్వ ఆదేశాలను వ్యతిరేకంగా నిరసన తెలుపుతుండగా.. ఓ స్వచ్ఛంద సంస్థ



ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలను సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అదేవిధంగా ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి పిటీషన్ దాఖలైయ్యాయి. ఈ పిటీషన్లపై సోమవారం జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసుపై విచారణ సందర్భంగా న్యాయవాది సీయూ సింగ్ మాట్లాడారు. యూపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి చట్టపరమైన హక్కు లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇలా గతంలో ఎప్పుడూ జరగలేదు. రోడ్డు పక్కన టీ స్టాల్, వీధి వ్యాపారులు నేమ్ ప్లేట్లను అమర్చడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని సీయూ సింగ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మైనార్టీలను గుర్తించి వారిని ఆర్థికంగా దెబ్బతీసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లుందని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ.. అసలైన ఉద్దేశం కనిపించకుండా మభ్యపెడుతూ ఇచ్చిన ఆదేశాలు ఇవి. నేమ్ ప్లేట్స్ ప్రదర్శిచకుండా ఈ ఆదేశాలను ఉల్లంఘించినవారికి జరిమానా విధిస్తారు. ఎవరు మనకు వడ్డిస్తున్నారని కాకుండా.. తినాలనుకుంటున్న ఆహారాన్ని బట్టి మనం రెస్టారెంట్లకు వెళ్తాం. నేమ్ బోర్డు ఏర్పాటు ద్వారా ఓ వర్గాన్ని గుర్తింపు బట్టి దూరం పెట్టే ఉద్దేశమే ఈ ఉత్తర్వుల్లో కనిపిస్తోంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అని అభిషేక్ సింఘ్వీ కోర్టు వెల్లడించారు.



## చంద్రబాబును కలిసిన
# బండారు దత్తాత్రేయ

- ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిసిన హర్యానా గవర్నర్
- దత్తాత్రేయకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన ఏపీ సీఎం
- వెంకటేశ్వరస్వామి వారి చిత్రపటాన్ని బహూకరించిన చంద్రబాబు

**విశ్వంభర, ఉండవల్లి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడును హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కలిశారు. ఏపీ సీఎంను ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దత్తాత్రేయకు చంద్రబాబు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికి, శాలువా కప్పి సన్మానించారు. ఆయనకు వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని బహూ కరించారు. అనంతరం దత్తాత్రేయ ఏపీ సీఎంను శాలువాతో సన్మానించారు. అనంతరం కాసేపు ఇరువురు పలు అంశాలపై చర్చించుకున్నారు.

# రుషికొండ ప్యాలెస్‌పై ఆసక్తికర చర్చ

- బీఏసీ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు
- రుషికొండలో రూ.25 లక్షల టాయిలెట్ ను అందరికీ చూపించాలన్న విష్ణు
- రూ.30 కానీ, రూ.50 కానీ టికెట్ పెట్టాలని సూచన
- రూ.50 అయితే మరీ ఎక్కువేమోనన్న చంద్రబాబు
- తాను కూడా అంత ఖరీదైన టాయిలెట్ ను ఎప్పుడూ చూడలేదని వెల్లడి



**విశ్వంభర, అమరావతి :** ఇవాళ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మధ్య రుషికొండ ప్యాలెస్ పై ఆసక్తికర చర్చ జరిగింది. రుషికొండ ప్యాలెస్ ను ప్రజల సందర్శనార్థం ఉంచాలని విష్ణుకుమార్ రాజు కోరారు. రూ.25 లక్షల ఖరీదైన టాయిలెట్ ను చూసే అవకాశం అందరికీ కల్పించాలని అన్నారు. రూ.30 లేదా రూ.50 ఎంట్రీ ఫీజు పెట్టాలని విష్ణుకుమార్ రాజు సూచించారు. అందుకు చంద్రబాబు స్పందిస్తూ రూ.50 అంటే మరీ ఎక్కువేమో అని వ్యాఖ్యానించారు. అంతేకాదు, తాను కూడా అంత ఖరీదైన టాయిలెట్‌ను ఎప్పుడూ చూడలేదని అన్నారు. రుషికొండ ప్యాలెస్ అక్రమ నిర్మాణాన్ని ప్రజలకు చూపించాల్సిందేని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. ఆ ప్యాలెస్ లో ప్రతి వస్తువు ఎదుట ధర వివరాలు ప్రదర్శిస్తూ బోర్డులు పెట్టాలని అన్నారు. తద్వారా జగన్ ఎంత మేర నిధులు దుర్వినియోగం చేశాడో బహిర్గతం చేయాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు అగ్రిమెంట్ బయటపెడితే అక్రమాలు అన్నీ బయటికి వస్తాయని తెలిపారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే రుషికొండ ప్యాలెస్ పై చర్చ జరిగితే బాగుంటుందని విష్ణుకుమార్ రాజు అభిప్రాయపడ్డారు.

# ఏపీలో రైతులందరికీ పంట బీమా

- అచ్చెన్నాయుడు అధ్యక్షతన మంత్రులు, అధికారుల సబ్ కమిటీ సమావేశం
- హాజరైన పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, ధూళిపాళ్ల నరేంద్ర
- వ్యవసాయంపై ప్రకృతి విపత్తుల ప్రభావంపై చర్చ
- విపత్తుల సమయాల్లో రైతులకు న్యాయం జరగాలన్న సబ్ కమిటీ



**విశ్వంభర, విజయవాడ :** ఏపీలో రైతులందరికీ పంట బీమా అమలు చేయాలని మంత్రులు, అధికారులతో కూడిన సబ్ కమిటీ నిర్ణయించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన నేడు సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సబ్ కమిటీలో పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, ధూళిపాళ్ల నరేంద్ర సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయంపై ప్రకృతి విపత్తుల ప్రభావంపై చర్చించారు. ఈ సందర్భంగా పంటల బీమా అంశంపై నిర్ణయం తీసుకున్నారు. గత సర్కారు హయాంలో పంటల బీమా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని సబ్ కమిటీ సభ్యులు విమర్శించారు. విపత్తు సమయాల్లో రైతులకు న్యాయం జరగాలంటే సరైన పంటల బీమా విధానం అమల్లో ఉండాలని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతులందరికీ న్యాయం చేస్తుందని స్పష్టం చేశారు.

## దేవాదాయ శాఖలో శాంతి నియామకంపై
# ఆరోపణలు ఉన్నాయి

- ఇటీవల వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై మీడియాలో విస్తృతంగా కథనాలు
- ఈ వ్యవహారంలో కేంద్ర బిందువుగా శాంతి
- శాంతి నియామకంలో తప్పు జరిగితే పీఎస్సార్ ఆంజనేయులు కూడా బాధ్యులేనన్న మంత్రి ఆనం
- అప్పుడు పీఎస్సార్ ఆంజనేయులు ఏపీపీఎస్సీలో ఉన్నారని వెల్లడి



**విశ్వంభర, విజయవాడ :** ఇటీవల మీడియాలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై తీవ్రస్థాయిలో కథనాలు ప్రసారం కాగా, ఈ వ్యవహారంలో కేంద్ర బిందువుగా ఉన్న శాంతి అంశంపై ఏపీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. దేవాదాయ శాఖలో శాంతి ఉద్యోగ నియామకంపై ఆరోపణలు ఉన్నాయని వెల్లడించారు. అప్పుడు పీఎస్సార్ ఆంజనేయులు ఏపీపీఎస్సీలో ఉన్నారని తెలిపారు. శాంతి నియామకంలో తప్పు జరిగితే పీఎస్సార్ ఆంజనేయులు కూడా బాధ్యులేనని ఆనం స్పష్టం చేశారు. దీనిపై ఆధారాలు సేకరించాక ఏపీపీఎస్సీని వివరణ కోరతామని చెప్పారు. విశాఖలో పనిచేసినప్పుడు శాంతిపై పలు ఫిర్యాదులు వచ్చాయని, ముఖ్యంగా ప్రేమ సమాజం భూముల విషయంలో శాంతిపై ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. విశాఖ భూ అక్రమాల్లో శాంతితో పాటు సుభాష్ పైనా ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. దీనికి సంబంధించి అన్ని ఆధారాలను అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. ఇవాళ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం వేళ, శాసనసభ లాబీల్లో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మంత్రి ఆనం ఈ వ్యాఖ్యలు చేశారు.



## అసెంబ్లీలో జనసేన పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నాదెండ్ల మనోహర్

**విశ్వంభర, అమరావతి :** ఏపీ అసెంబ్లీలో జనసేన పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక అసెంబ్లీలో పార్టీ చీఫ్ విప్ గా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, కోశాధికారిగా భీమవరం ఎమ్మెల్యే పులపర్తి ఆంజనేయులు, కార్యదర్శులుగా విశాఖ సౌత్ ఎమ్మెల్యే చెన్నుబోయిన వంశీకృష్ణ, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమాచారం అందించారు.





## ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక
# 31 రాజకీయ హత్యలు

- వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి
- పార్లమెంటులో ఎండగడతామని వెల్లడి
- మిథున్ రెడ్డి వ్యాఖ్యలపై గణాంకాలతో స్పందించిన పోలీస్ శాఖ

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, 31 రాజకీయ హత్యలు జరిగాయని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి వ్యాఖ్యానించడం తెలిసిందే. ఏపీలో రాజకీయ కక్షలతో జరుగుతున్న దాడులను తాము పార్లమెంటులో ప్రస్తావిస్తామని, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని దేశం మొత్తానికి వివరిస్తామని మిథున్ రెడ్డి చెప్పారు. అయితే, ఏపీలో 31 రాజకీయ హత్యలు జరిగాయన్న ఎంపీ మిథున్ రెడ్డి వ్యాఖ్యలపై ఏపీ పోలీస్ శాఖ స్పందించింది. జూన్ 4 నుంచి జులై 22 వరకు రాష్ట్రంలో రాజకీయ కారణాలతో జరిగిన హత్యలు 4 అని వెల్లడించింది. అందులో అనంతపురం జిల్లాలో 2, గుంటూరు జిల్లాలో 1, కర్నూలు జిల్లాలో 1 ఘటన జరిగాయని వివరించింది. మృతి చెందినవారిలో ముగ్గురు టీడీపీకి చెందినవారని, ఒకరు వైసీపీకి చెందినవారని పోలీస్ శాఖ స్పష్టం చేసింది. ఇక, పాతకక్షలు, రాజకీయ విభేదాలతో ఆవేశపూరితంగా జరిగిన గొడవల్లో పల్నాడు జిల్లాలో 1, శ్రీ సత్యసాయి జిల్లాలో 1 హత్య జరిగినట్టు వెల్లడించింది. మృతులు ఇద్దరూ వైసీపీకి చెందినవారని పేర్కొంది.

## ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించినక
# మాకెందుకు భయం?

- 50 రోజుల పాలనలో కూటమి విఫలమైందన్న జగన్
- ప్రభుత్వం వేసే ప్రతి అడుగులో భయం కనిపిస్తోందని వ్యాఖ్యలు
- చంద్రబాబు బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కూడా భయపడుతున్నారని విమర్శలు
- జగన్ ప్రతి మాటలోనూ ఫ్రస్టేషన్ కనిపిస్తోందన్న నారా లోకేశ్
- మొన్నటి ఓటమి భయం ఇంకా వెంటాడుతున్నట్టుందని ఎద్దేవా



**విశ్వంభర, అమరావతి :** ఈ 50 రోజుల పాలనలో అన్నింటా విఫలమైన కూటమి ప్రభుత్వం భయపడుతోందని, ప్రభుత్వం వేసే ప్రతి అడుగులో భయం కనిపిస్తోందని, చంద్రబాబు ఎంతగా భయపడుతున్నాడంటే బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేకపోతున్నాడని జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. తాజాగా, మంత్రి నారా లోకేశ్ కూడా జగన్ పై విరుచుకుపడ్డారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ కి ఇంకా తత్వం బోధపడినట్టు లేదని ఎద్దేవా చేశారు. ఈ 50 రోజుల ప్రభుత్వంలో మేం భయంతో ఉండడం కాదు ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల బాధ్యతతో ఉన్నాం. మీరే ఇంకా భ్రమల్లో ఉన్నారు. అధికారం దూరమైందన్న బాధ, అక్రమార్జన ఆగిపోయిందన్న ఆవేదన, ఉనికిని చాటుకోలేకపోతున్నామనే మీ నిస్పృహ, ఫేక్ రాజకీయం పండడం లేదనే ఫ్రస్టేషన్, ప్రజల్లో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఉక్రోషం... మీ మాటల్లో, మీ చేష్టల్లో, మీ కుట్రల్లో అడుగడుగునా కనిపిస్తున్నాయి. జగన్ గారూ, మీరు ఓ విషయం గుర్తించాలి. ప్రతిపక్ష హోదా కూడా రాని స్థాయిని మీకు కట్టబెట్టింది ప్రజలు. దానికి కారణాలు ఇప్పటికైనా తెలుసుకోండి, వాస్తవాలు అంగీకరించండి. జగన్ ఇంకా ఇలాగే వ్యవహరిస్తుంటే, తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా ఉంటే... మొన్న ఎన్నికల్లో 151 లో 5 మాయం అయ్యింది, ఇప్పుడు 11లో ఒకటి మాయం అవుతుంది. శిశుపాలుడు ఎవరో, ఎవరి పాపం పండిందో మొన్న ప్రజలే తేల్చిచెప్పారు. ఐదేళ్ల పాటు మీరు సాగించిన విధ్వంసాన్ని 50 రోజుల్లోనే మా కూటమి ప్రభుత్వం తుడిచివేయలేదంటూ మీరు చేసే విషప్రచారం ప్రజామోదం పొందదు. ఇక భయం గురించి అంటారా... ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించిన మాకెందుకు భయం? ఎవరిని చూసి భయం? మీ తీరు చూస్తుంటే మొన్నటి ఓటమి భయం మిమ్మల్ని తీవ్రంగా వెంటాడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది" అని నారా లోకేశ్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల సంఘం
# జిల్లా ఇంచార్జ్‌ల నియామకం
### డాక్టర్ పిడమర్తి రవి


**విశ్వంభర,** తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం సాధన కోసం ఏర్పడిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం పది జిల్లాల ఇన్చార్జిలను నియమిస్తూ నియామక పత్రాన్ని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి విడుదల చేశారు. మహబూబ్ నగర్ విష్ణువర్ధన్ గౌడ్, ఖమ్మం రడం సురేష్, వరంగల్ గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ దేవిరెడ్డి విజయ్, మెదక్ కుమార్ సాగర్, నిజాంబాద్ శ్రీనివాస్ గౌడ్, ఆదిలాబాద్ శ్రవణ్ నాయక్, హైదరాబాద్ శివ గౌడ్, రంగారెడ్డి సంజయ్ గౌడ్, కరీంనగర్ పాలెపు దిలీప్ లను పది జిల్లాలకు ఇన్చార్జీలుగా వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి నియమించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్స్, ఈ ఉపేందర్, ఎస్ కే రహీం పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్ కాపాడుకుంటే

## 2027లో ప్రపంచకప్‌లో వారిద్దరూ ఆడతారు

### టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా టీ20 ప్రపంచ కప్ 2024 గెలిచిన తర్వాత, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అంతర్జాతీయ స్థాయిలో పొట్టి ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. రాబోయే కాలంలో టీమిండియా 2025లో ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు 2027లో వన్డే ప్రపంచకప్ ఆడనుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఇద్దరు ఆటగాళ్లు ఎన్ని రోజులు ఆడతారు, వీరి విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచనేంటి అన్నది కూడా చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో వీరికి సంబంధించి టీమ్ ఇండియా కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్లాన్ ఏమిటనే విషయం ఇప్పుడు వెల్లడైంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు తదుపరి వన్డే ప్రపంచకప్‌లో కూడా ఆడటం చూడగలమంటూ గుడ్ న్యూస్ చెప్పుకొచ్చాడు.

#### గంభీర్ ఏమన్నాడంటే..

టీమ్ ఇండియా కొత్త ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన మొదటి ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనే ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ల భవిష్యత్తు గురించి ప్రశ్నించారు. ఈ మేరకు గౌతీ స్పందిస్తూ.. "విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇద్దరిలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉంది. వారు ప్రపంచ స్థాయి ఆటగాళ్లు. ఏ జట్టుకైనా ఇలాంటి వాళ్లు ఉండాలి. ప్రస్తుతం ఛాంపియన్స్ ట్రోఫీ, ఆస్ట్రేలియా సిరీస్ ఉంది. వారి ఫిట్‌నెస్ బాగా ఉంటే, వారు 2027 ప్రపంచ కప్ వరకు కూడా ఆడగలరు" అంటూ చెప్పుకొచ్చాడు. భారతదేశంలో, సీనియర్ ఆటగాళ్ళ భవిష్యత్తుపై తరచుగా ప్రశ్నలు తలెత్తుతాయని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ విషయంలో కూడా అదే కనిపిస్తోంది. అయితే, వచ్చే ఏడాది జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ బాధ్యతలు స్వీకరిస్తాడని ఇటీవల బీసీసీఐ సెక్రటరీ జైషా ప్రకటించారు. మరోవైపు విరాట్ ప్లేస్ కూడా ఇప్పుడు కన్ఫర్మ్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు ఒక దశాబ్దానికి పైగా టీమ్ ఇండియాను నడిపించారు. అయితే, 2027 ప్రపంచ కప్ నాటికి విరాట్‌కి 38, రోహిత్‌కి 40 ఏళ్లు రానున్నాయి. ఈ కారణంగా వీరిద్దరు తదుపరి వన్డే ప్రపంచ కప్‌లో ఆడటం గురించి ఇంకా ఏమీ నిర్ణయించలేదు. కానీ, ఇప్పుడు కోచ్ గౌతం గంభీర్ తన స్టాండ్‌ను స్పష్టం చేశాడు. వారిద్దరూ తమ ప్రదర్శనను కొనసాగించి, వారి ఫిట్‌నెస్ బాగుంటే 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా ఆడటం చూడవచ్చు అని గంభీర్ చెప్పుకొచ్చాడు. ఇలాంటి పరిస్థితుల్లో విరాట్, రోహిత్ అభిమానులకు ఓ శుభవార్త వచ్చింది.




## చరిత్ర సృష్టించిన శ్రీలంక కెప్టెన్

### లంక భారీ విజయం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** మహిళల ఆసియా కప్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు చరిత్ర సృష్టించింది. టీ20 ఫార్మాట్‌లో జరుగుతున్న మెగా టోర్నీలో తొలి సెంచరీ సాధించింది. సోమవారం మలేషియా జట్టుపై శివాలెత్తిపోయిన ఆటపట్టు శతకంతో గర్జించింది. దాంతో, ఆసియా కప్ చరిత్రలో మూడంకెల స్కోర్ చేసిన తొలి మహిళా క్రికెటర్‌కు రికార్డుపుటల్లో నిలిచింది. సొంతగడ్డపై జరుగుతున్న ఆసియా కప్‌లో శ్రీలంక కెప్టెన్ ఆటపట్టు పరుగుల వరద పారిస్తోంది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 12 రన్స్‌తో నిరాశపరిచినా.. రెండో గేమ్‌లో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడింది. పసికూన బౌలర్లను ఉతికేస్తూ రికార్డు సెంచరీ కొట్టింది. ఆటపట్టు 69 బంతుల్లోనే 119 పరుగులతో అజేయంగా నిలిచింది. అనంతరం 185 పరుగుల ఛేదనలో మలేషియా బ్యాటర్లు చేతులెత్తేశారు. శంషిని గింషాని(3/9), కవిష దిల్హారి(2/4), కావ్యా కవింది(2/7)లు చెలరేగడంతో ప్రత్యర్థి జట్టు 40 పరుగులకే కుప్పకూలింది. దాంతో, లంక 144 పరుగుల తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరువైంది.

### సచిన్ రికార్డులను అధిగమించే

## సత్తా అతడికే ఉంది

### మైకెల్ వాన్




**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్టు క్రికెట్‌లో తన ఫామ్‌ను కొనసాగిస్తూ పరుగుల వరద పారిస్తున్నాడు. వెస్టిండీస్‌తో ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో అతడు సెంచరీ చేసి ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన 8వ బ్యాటర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో టెస్టు క్రికెట్‌లో సచిన్ నెలకొల్పిన అత్యధిక పరుగుల రికార్డు (15,921 పరుగులు)ను రూట్ అధిగమిస్తాడని అంటున్నాడు ఆ జట్టు మాజీ సారథి మైకెల్ వాన్. విండీస్‌తో రెండో టెస్టు ముగిశాక వాన్ టెలిగ్రాఫ్‌కు రాసిన వ్యాసంలో.. 'కొద్దిరోజుల్లోనే జో రూట్ ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు (టెస్టులలో) చేసిన బ్యాటర్‌గా నిలుస్తాడు. ప్రస్తుతం టెస్టులు ఆడుతున్న వారిలో సచిన్ రికార్డులను అధిగమించే సత్తా అతడికే ఉంది. రూట్ గతంలో మాదిరిగా ఆచితూచి ఆడటం కంటే దూకుడుగానే ఆడుతూ వేగంగా పరుగులు రాబడుతున్నాడు..'అని అన్నాడు. కాగా టెస్టులలో ఫ్యాబ్-4గా పిలుచుకునే ఆటగాళ్లలో రూట్, కోహ్లీ, విలియమ్సన్, స్మిత్ ఉన్నా ఈ నలుగురిలో అత్యధిక పరుగులు చేసిన వారిలో రూట్ ముందున్నాడు. రూట్ ప్రస్తుతం 11,940 పరుగులతో ఉండగా స్మిత్ (9,685), కోహ్లీ (8,848), కేన్ (8,743) అతడికంటే చాలా వెనుకబడి ఉన్నారు. ఇంగ్లండ్ క్రికెట్‌లో అలెస్టర్ కుక్ (12,472) రికార్డును అధిగమించేందుకు సుమారు 500 పరుగుల దూరంలో ఉన్న రూట్.. ఇదే జోరును కొనసాగిస్తే త్వరలోనే సచిన్ రికార్డుకు ఎసరు పెట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. విండీస్‌తో రెండో టెస్టులో సెంచరీ చేయడంతో ఈ ఫార్మాట్‌లో రూట్.. శివనారాయణ్ చందర్‌పాల్ (11,867 రన్స్)ను దాటేశాడు. మరో విండీస్ దిగ్గజం బ్రియాన్ లారా (11,953)ను అధిగమించడానికి అతడికి 13 పరుగులు మాత్రమే కావాల్సి ఉండగా కరేబియన్ జట్టుతో జరుగబోయే మూడో టెస్టులో ఆ రికార్డును బ్రేక్ చేయడానికి సిద్ధమవుతున్నాడు.

## ముంబై ఇండియన్స్‌కు బిగ్ షాక్..

### రోహిత్‌తో పాటు ఆ స్టార్ ప్లేయర్ గుడ్‌బై!



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్‌కి ఇంకా చాలా సమయం ఉంది. అందులోనూ ఐదు నెలల్లో ఐపీఎల్ మెగా వేలం జరగనుంది. అప్పుడే రానున్న సీజన్‌పై ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. చాలా మంది స్టార్ ప్లేయర్లు టీమ్‌లు మారే అవకాశం ఉంది. కొన్ని ఫ్రాంచైజీలు రోహిత్, పంత్ వంటి స్టార్స్‌పై కన్నేశాయని ప్రచారం జరుగుతోంది. మెగా వేలం రూల్స్ ప్రకారం నలుగురు, ఐదుగురు ఆటగాళ్లను మాత్రమే రిటైన్ చేసుకునే అవకాశం ఉండటంతో జట్లన్నీ పూర్తిగా మారిపోనున్నాయి. ఐపీఎల్ మెగా వేలానికి సంబంధించి ఇప్పటికే బీసీసీఐ ప్రణాళికలు మొదలుపెట్టింది. ఈ ఏడాది డిసెంబర్‌లో మెగా వేలం నిర్వహించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే రిటెన్షన్ పాలసీని రూపొందించడంపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఫోకస్ పెట్టింది. ముంబయి ఇండియన్స్‌ని చాలా సంవత్సరాలు రోహిత్ శర్మ, సూర్య కుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా తమ భుజాలపై మోశారు. ఫ్రాంచైజీని టాప్ పొజిషన్‌లో నిలపడంలో కీలక పాత్ర పోషించారు. కానీ, ఇప్పుడు ఈ ముగ్గురు స్టార్లు ఎంఐకి దూరం కానున్నట్లు ప్రచారం సాగుతోంది. 2025 వేలంలో రోహిత్, సూర్యను కోల్‌కతా నైట్ రైడర్స్ కొనే ప్లాన్‌లో ఉన్నట్లు సమాచారం. గత సీజన్‌లో రోహిత్‌ను పక్కనపెట్టి, ఎప్పటి నుంచో ఉన్న తమను కాదని పాండ్యకి కెప్టెన్సీ ఇవ్వడం సూర్య, బుమ్రాకి నచ్చలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో వీరిద్దరూ ముంబయిని వీడాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకవేళ ముంబయి రోహిత్ శర్మను వదిలేస్తే హిట్‌మ్యాన్ గుజరాత్ టైటాన్స్ లేదా దిల్లీ క్యాపిటల్స్‌లో చేరే అవకాశం ఉందనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ఐపీఎల్ 2024 సీజన్ ముంగిట ముంబై ఇండియన్స్.. రోహిత్ శర్మపై వేటు వేసి హార్దిక్ పాండ్యాను తమ నయా సారథిగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో ముంబై ఇండియన్స్ జట్టులో విభేధాలు తలెత్తాయి. హార్దిక్ పాండ్యాకు సీనియర్లు ఎవరూ సహకరించలేదు. ఈ క్రమంలోనే ముంబై ఇండియన్స్ రిటెన్షన్‌కు రోహిత్, సూర్య ఒప్పుకోలేదని తెలుస్తోంది. ఈ ఇద్దరిలో ఒకరు ఢిల్లీ క్యాపిటల్స్, మరొకరు లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది. రోహిత్ శర్మ సారథ్యంలో ముంబై ఇండియన్స్ ఐదు సార్లు విజేతగా నిలిచింది. అయితే రోహిత్ శర్మ కెరీర్ చివరి దశలో ఉండటంతో టీమ్ భవిష్యత్తు గురించి ఆలోచించిన ముంబై ఇండియన్స్.. హార్దిక్ పాండ్యాను సారథిగా ఎంపిక చేసింది. కానీ ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది.

# లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులకు ఇలా చెక్ పెట్టండి

**విశ్వంభర, బిజినెస్ :** ఇటీవల కాలంలో లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు బాగా పెరిగిపోతున్నాయి. దీనితో చాలా మంది ఈ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు పరువు పోతుందనే భయంతో, నిస్సహాయక స్థితిలో తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారు. నిజానికి రుణగ్రహీతలకు చాలా చట్టపరమైన హక్కులు ఉంటాయి. అవి తెలియకపోవడం వల్లనే, చాలా మంది రికవరీ ఏజెంట్ల అంటే భయపడుతుంటారు. కానీ అలాంటి అవసరం ఏమాత్రం లేదు. వేధింపుల నుంచి రక్షణ? ప్రస్తుతం చాలా బ్యాంక్‌లు, నాన్-బ్యాంకింగ్ సంస్థలు తమ కస్టమర్ బేస్‌ను పెంచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అందుకే చాలా సులువుగా రుణాలు మంజూరు చేస్తున్నాయి. పైగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ ఆర్థిక సంస్థలకు సంబంధించిన రుణ నిబంధనలను కూడా సడలించింది. అయితే ఇక్కడే అసలు సమస్య మొదలైంది. లోన్లు సులువుగా లభించడం వల్ల రుణ ఎగవేతలు బాగా పెరిగాయి. వీటిని రాబట్టేందుకు బ్యాంకులు, ఇతర రుణ సంస్థలు రికవరీ ఏజెంట్లను నియమిస్తున్నాయి. వీరు శృతిమించి ప్రవర్తిస్తూ, రుణగ్రహీతలను తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నారు. అందుకే ఈ డిఫాల్ట్‌ల పెరుగుదల, రికవరీ ఏజెంట్ల వేధింపుల నుంచి రుణగ్రహీతలను రక్షించడానికి ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలను రూపొందించింది.

#### ఆర్‌బీఐ మార్గదర్శకాలు

ఒక రుణగ్రహీత డిఫాల్టర్‌గా మారడానికి, ఉద్యోగం కోల్పోవడం లేదా ఇతర ఆర్థిక ఆకస్మిక సమస్యలు రావడం, లేదా మరేదైనా బలమైన కారణం ఉండొచ్చు. ఈ వాస్తవాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అర్థం చేసుకుంది. అందుకే రుణగ్రహీతల, కస్టమర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. రుణగ్రహీతలు ఏమేమి చేయవచ్చో ఇప్పుడు చూద్దాం.

ప్రూఫ్స్ అవసరం రికవరీ ఏజెంట్లు మిమ్మల్ని వేధిస్తుంటే, అందుకు సంబంధించి సాక్ష్యాలను మీరు చూపించాల్సి ఉంటుంది. అందుకే మీరు రికవరీ ఏజెంట్ నుంచి వచ్చే అన్ని కాల్స్, ఈ-మెయిల్స్, మెసేజ్‌లను రికార్డ్ చేసుకోవాలి. ఈ సాక్ష్యాలను (ప్రూఫ్‌లను) మీ లోన్ ఆఫీసర్‌కు లేదా ఆర్థిక సంస్థకు సమర్పించాలి.


#### ఆర్‌బీఐకి రిపోర్ట్

రికవరీ ఏజెంట్ల వేధింపులు ఎంతకూ ఆగకపోతే, అప్పుడు మీరు అన్ని వివరాలతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లెటర్ లేదా ఇమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

#### పరువు నష్టం దావా

రికవరీ ఏజెంట్లు మిమ్మల్నే కాకుండా, మీ స్నేహితులు, కుటుంబ సభ్యులను సంప్రదించినా, లేదా వేధించినాబీ లేదా మీ ఆఫీసులో లేదా పరిసరాల్లో ఇబ్బందులకు గురిచేసినా, మీరు సదరు రికవరీ ఏజెంట్‌పై, అతనిని పంపిన బ్యాంక్‌పై పరువు నష్టం దావా వేయవచ్చు. రికవరీ ఏజెంట్లు అనుమతి లేకుండా మీ ఇంటిలోకి, ఇతర ప్రాపర్టీల్లోకి ప్రవేశిస్తే, అప్పుడు మీరు అతిక్రమణ దావా కూడా వేయవచ్చు.

#### తక్షణ సహాయం



మీరు ఇవన్నీ చేసినా రికవరీ ఏజెంట్ల వేధింపులు ఆగకపోతే, అప్పుడు మీరు మరింత కఠినమైన చర్యలు తీసుకోవచ్చు. కానీ అంతకంటే ముందు మీరు పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలి. ఒక వేళ పోలీసులు మీకు సాయం చేయకపోయినా, లేదా మీ ఫిర్యాదును నమోదు చేయకపోయినా, మీరు బ్యాంకుకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించవచ్చు.

#### ఆర్‌బీఐ మార్గదర్శకాలు

రుణగ్రహీతల విషయంలో, రికవరీ ఏజెంట్లు గైడ్‌లైన్స్ అతిక్రమించినా, అసభ్యకరమైన (అబ్యూజివ్) రీతిలో ప్రవర్తించినా ఆర్‌బీఐ కఠిన చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా ఇలాంటి అంశాలపై అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో రికవరీ ఏజెంట్లను నియోగించకుండా బ్యాంకులను ఆర్‌బీఐ కట్టడిచేస్తుంది. అంతేకాదు పదే పదే ఇలాంటి తప్పులు జరుగుతుంటే, ఆర్‌బీఐ నిషేధం విధిస్తుంది. అవసరమనుకుంటే దానిని పొడిగిస్తుంది కూడా. కనుక మీకు ఇలాంటి పరిస్థితి ఏర్పడితే, ఏమాత్రం భయపడకుండా, మీ హక్కులను ఉపయోగించుకోండి.

# కేంద్రం నుంచి సూపర్ స్కీం




**విశ్వంభర, బిజినెస్ :** నేటికాలంలో డబ్బులు సంపాదించడం చాలా కష్టం. అలానే అర్జించిన ధనాన్ని ఆదాయ చేసుకోవడం ఇంకా కష్టం. అయితే మనం సంపాదించిన దాంట్లో కొంత ఆదా చేసుకుంటే భవిష్యత్ లో ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఆదుకుంటాయి. ఈ క్రమంలోనే చాలా మంది వివిధ రకాల వాటిల్లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తుంటారు. అయితే వాటిల్లో రిస్క్ అనేది ఉండొచ్చు. అయితే కేంద్ర ప్రభుత్వం అందించే వాటిల్లో మన పెట్టుబడికి గ్యారెంటీ ఉంటాది. అలానే కొన్ని స్కీమ్ చూసినట్లు అయితే అదిరిపోయే లాభాను అందిస్తాయి. అలా కేంద్రం ప్రభుత్వం నుంచి ఓ సూపర్ స్కీమ్ అందుబాటులో ఉంది. కేవలం 5 లక్షలు కడితే.. 40 లక్షలు లాభం వస్తుంది. మరి.. ఈ స్కీమ్ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దా...

నేటికాలంలో చాలా మంది పెట్టుబడి పట్టేందుకు చాలా మార్గాలు ఉన్నప్పటికీ ఎలాంటి రిస్క్ లేకుండా..మంచి లాభాలు వచ్చే వాటివైపే చూస్తుంటారు. అలాంటి వాటిల్లో ప్రభుత్వ భద్రత కలిగిన పోస్టాఫీస్ పథకాలు చాలా బెస్ట్ అనే చెప్పావచ్చు. ఈ పోస్టాఫీసు ముఖ్యంగా ఎటువంటి రిస్క్ ఉండదు. అలానే పోస్టాఫీసులో మంచి లాభాలు కావలనుకునే వారికి మరో కొత్త స్కీమ్ ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అనేది అందుబాటులోకి తెచ్చింది కేంద్ర ప్రభుత్వం. ఆ పథకం గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.కేంద్ర ప్రభుత్వం ఇప్పటి దాకా పోస్టాఫీసు ద్వారా ఎన్నో రకాల సేవింగ్స్ స్కీమ్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సీనియర్ సిటిజెన్లకు సీనియర్ అనేక రకాల స్కీమ్ ను అమలు అందుబాటులో ఉన్నాయి. వీటి మాదిరిగానే దీర్ఘకాలంలో మంచి రాబడులు అందించే కిసాన్ వికాస్ పత్ర అనే మరో పథకం కూడా ఉంది. ఈ స్కీమ్ లో ఎలాంటి రిస్క్ ఉండదు. పైగా ఇందులో మంచి లాభా లు కూడా వస్తాయి. ఈ స్కీమ్ లో ఎంత పెట్టుబడి పెట్టినా కూడా సరి గ్గా 9 ఏళ్లల్లో 7 నెలల్లో రెట్టింపు అవుతాయి. ఈ స్కీమ్స్ కనీస 1000 రూపాయలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఇందులో గరిష్టంగా ఎంతైనా కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. దీనికి ఎలాంటి పరిమితి లేదు. కిసాన్ వికాస్ పత్ర పథకంలో సింగిల్ ఖాత కూడా తెరవచ్చు. అదే విధంగా ముగ్గురు కలిసి ఉమ్మడి ఖాతాను తెరవచ్చు. ఈ పథకం కింద అందిం చే వడ్డీ రేటు ప్రస్తుతం ఏడాదికి 7.50 శాతంగా ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఓసారి ఈ స్కీమ్ వడ్డీ రేట్లలో మార్పులుచ స్తుంది. ఈ క్రమంలో ఈ వడ్డీ రేటు అనేది పెరగొచ్చు లేదా తగ్గొచ్చు. ఈ స్కీమ్ లో 9 ఏళ్ల 7 నెలల్లో పెట్టిన ఇన్వెస్ట్ మెంట్ ను రెట్టింపు చేసుకోవచ్చు. ఉదాహరణకు రూ. లక్ష పెట్టు బడి పెడితే ప్రభుత్వం అందించే వడ్డి ప్రకారం రూ. 2 లక్షలవుతుంది. అలాగే రూ.5 లక్షలు పెడితే.. అది కాస్త రూ.10 లక్షలుగా, రూ.20 లక్షలు పెడితే రూ.40 లక్షలుగా రెట్టింపు అవుతుంది. మీరు ఈ పథకం కింద రుణం కూడా తీసుకోవచ్చు. బ్యాంకులు , పోస్టాఫీసుల్లో ఈ అకౌంట్ ఓపెన్ చేయొచ్చు. ఇంటి అడ్రస్ ప్రూఫ్, ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి కేవైసీ డాక్యుమెంట్స్ దీనికి అవసరం. మొత్తంగా ఈ స్కీమ్ లో పెట్టుబడులు పెడితే..రిస్క్ లేని లాభాలు వస్తాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.



# అజిత్ కుమార్ హీరోగా 'విడాముయర్చి'

**విశ్వంభర, సినిమా :** అగ్ర కథానాయకుడు అజిత్‌కుమార్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో మగిళ్ తిరుమేని దర్శకత్వంలో రూపొందుతోన్న 'విడాముయర్చి'పై అభిమానులలో ఆసక్తి పెరిగింది. అజిత్ లుక్ బయటకు రావడంతో ఒక్కసారిగా అంచనాలన్నీ రెట్టింపు అయ్యాయి. 'విడాముయర్చి' ప్రారంభం నుంచీ కోలీవుడ్, టాలీవుడ్‌లో ఈ మూవీపై అందరి దృష్టి పడింది. ఇండియన్ సినీ ఇండస్ట్రీలో స్టార్స్‌తో భారీ బడ్జెట్ చిత్రాలు, డిఫరెంట్ కంటెంట్ బేస్డ్ సినిమాలను నిర్మిస్తోన్న టాప్ ప్రొడక్షన్ హౌస్ లైకా ప్రొడక్షన్స్. ఈ సంస్థ అధినేత సుభాస్కరన్..'విడాముయర్చి' సినిమాను నిర్మిస్తున్నారు. ఆద్యంతం ఆకట్టుకునే ఎంటర్‌టైన్మెంట్ చిత్రాలతో పాటు విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడిగా పేరున్న మగిళ్ తిరుమేని, అజిత్‌తో ఈ భారీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అజిత్ కెరీర్‌లో బ్లాక్ బస్టర్ మూవీలలో ఒకటైన 'మంగాత'లో, అజిత్ కుమార్, త్రిష, యాక్షన్ కింగ్ అర్జున్ తమదైన నటనతో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు మరోసారి వీరు ముగ్గురు ఆడియెన్స్‌ను మెప్పించనున్నారు. ఇంకా ఈ చిత్రంలో ఆరవ్, రెజీనా కసాండ్ర, నిఖిల్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. అనిరుధ్ సంగీతాన్ని అందించిన ఈ సినిమా నుంచి ఇప్పుడు మరో అప్డేట్ వచ్చింది. సినిమా షూటింగ్‌ను పూర్తి చేసినట్టుగా నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు చిత్రయూనిట్ అందరూ కలిసి ఫోటోకు పోజిచ్చారు. షూటింగ్‌ను పూర్తి చేసిన ఆనందం వారి కళ్లల్లో కనిపిస్తోంది. ఎంతో సరదాగా షూటింగ్‌ను ఫినిష్ చేశారని అర్థం అవుతోంది. ఈ సినిమా శాటిలైట్ హక్కులను సన్ టీవీ సొంతం చేసుకోగా, ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది.

# గ్లామర్‌తో రెచ్చిపోతున్న కీర్తి సురేష్

**విశ్వంభర, సినిమా:** కీర్తి సురేష్.. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. చేసింది తక్కువ సినిమాలే అయిన మంచి క్రేజ్ సొంతం చేసుకుంది ఈ బ్యూటీ. నేను శైలజ సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన కీర్తిసురేష్ తొలి సినిమాతోనే మంచి క్రేజ్‌ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయింది. మహానటి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయింది. ప్రస్తుతం తెలుగు, తమిళ సినిమాల్లో బిజీగా ఉంది. కాగా ఎప్పుడూ సంప్రదాయ దుస్తులను ధరించి అందరి దృష్టిని ఆకర్షించింది ఈ ముద్దుగుమ్మ. సినిమాల్లో కూడా ఎక్కడా బోల్డ్ రోల్స్ ఎంచుకోలేదు ఈ అమ్మడు. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో కీర్తి సురేష్ గ్లామర్ గేట్లు ఎత్తేస్తోంది.

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన సర్కారు వారి పాట సినిమాలో కాస్త గ్లామరస్ గా కనిపించింది ఈ అమ్మడు. ఇక ఇప్పుడు పూర్తిగా గ్లామర్ అవతార్‌లో మెరుస్తోంది. రీసెంట్ డేస్ లో ఆమె డ్రస్సింగ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే కీర్తిసురేష్ ఇప్పుడు బాలీవుడ్‌లోకి అడుగుపెట్టేందుకు రెడీ అవుతుంది. హిందీ చిత్ర పరిశ్రమ గాలికి ఆమె ఇంతలా మారిపోయారా అనే ప్రశ్న తలెత్తుతోంది. బాలీవుడ్ లో చాలా మంది హీరోయిన్స్ గ్లామర్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. రొమాంటిక్ సీన్స్ లో నటించడానికి, బోల్డ్‌గా కనిపించడానికి అస్సలు మొహమాటపడరు. ఇక కీర్తి కూడా ఇప్పుడు గ్లామరస్ గా కనిపిస్తుండటంతో హిందీలో నెట్టుకురావాలంటే ఆ మాత్రం ఉండాలి అని నెటిజన్స్ గుసగుసలాడుకుంటున్నారు.

రీసెంట్ గా తమిళ సినిమా వన్ ఆడియో లాంచ్ ఈవెంట్‌లో కీర్తి సురేష్ కనిపించింది. ఈ ఈవెంట్ లో గ్లామరస్ గా కనిపించింది ఈ చిన్నది. చీర కట్టుకున్నా కూడా తన అందంతో ఆకట్టుకుంది. దాంతో ఆమె లుక్ అందరినీ ఆకర్షిస్తోంది. నటనకు ప్రాధాన్యమున్న, సంప్రదాయ పాత్రలు చేసిన ఈ బ్యూటీ ఇంతలా ఎలా ఇంతలా మారిపోయిందేంటీ అని అంతా షాక్ అవుతున్నారు. ఇక హిందీలో కీర్తి సురేష్ 'బేబీ జాన్' సినిమాలో నటిస్తోంది. ప్రముఖ తమిళ దర్శకుడు అట్లీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తమిళ సినిమా 'తేరి'కి రీమేక్. వరుణ్ ధావన్ హీరోగా చేస్తున్నాడు. వరుణ్‌కి జోడీగా కీర్తి సురేష్ నటిస్తుంది. హిందీలో తొలి సినిమా హిట్ అయితే భవిష్యత్తులో ఎన్నో ఆఫర్లు వస్తాయి. అందుకు ఉదాహరణ రష్మిక మందన్న.. ఈ అమ్మడు ఇప్పుడు నార్త్ లో బిజీగా ఉంది. ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో డిమాండ్ పెరిగింది. అదేవిధంగా కీర్తి సురేష్ భవిష్యత్తులో హిందీ చిత్రసీమలో బిజీ అవుతుందో లేదో చూడాలి.





# క్రిస్మస్‌కు గేమ్ ఛేంజర్ రిలీజ్

**విశ్వంభర, సినిమా :** రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సినిమా గేమ్ ఛేంజర్. ఈ సినిమా విడుదల తేదీపై దాదాపు 2 నెలలుగా సస్పెన్స్ కొనసాగుతోంది. అసలు ఈ ఏడాది ఈ సినిమా థియేటర్లలోకి వచ్చే అవకాశం లేదంటూ కొంతమంది వాదించడం మొదలుపెట్టారు. ఎట్టకేలకు గేమ్ ఛేంజర్ కు లైన్ క్లియర్ అయింది. ఈ సినిమా విడుదల తేదీని స్వయంగా నిర్మాత దిల్ రాజు ప్రకటించారు. ఈ రోజు జరిగిన రాయన్ సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్ కు ప్రత్యేక అతిథిగా హాజరైన దిల్ రాజు, గేమ్ ఛేంజర్ సినిమాను క్రిస్మక్ కానుకగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది గేమ్ ఛేంజర్ సినిమా. శంకర్ కు ఇదే తొలి తెలుగు సినిమా. అటు ఆర్ఆర్ఆర్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత చరణ్ నటిస్తున్న సినిమా కూడా ఇదే. అంతేకాదు, దిల్ రాజుకు కెరీర్ లో ప్రతిష్ఠాత్మక 50వ చిత్రం ఇది. అందుకే గేమ్ ఛేంజర్ పై అంచనాలు పెరిగాయి. కియరా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే ఓ సాంగ్ రిలీజైంది.


# దేవరపై అప్డేట్ ఇచ్చిన జాన్వీ కపూర్

**విశ్వంభర, సినిమా:** జూనియర్ ఎన్టీఆర్ నుంచి రాబోతున్న పాన్ ఇండియా సినిమా దేవర కోసం తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ నుంచి ఏ చిన్న అప్ డేట్ వచ్చినా కూడా వదలకుండా వైరల్ చేస్తున్నారు. అయితే దేవర నుంచి సరైన అప్ డేట్ వచ్చి చాలా రోజులు అవుతోంది. గాసిప్స్ అయితే వస్తున్నాయి. కానీ, అప్ డేట్స్ మాత్రం రావడం లేదు. ఇప్పుడు దేవర హీరోయిన్ జాన్వీ కపూర్ కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. షూటింగ్, సాంగ్స్, సినిమాలో తన పాత్ర గురించి కూడా చాలా ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం విశేషం. ఇప్పుడు జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. జాన్వీ కపూర్ దేవర సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ విడుదల కూడా కాకుండానే.. రామ్ చరణ్ బుచ్చిబాబు కాంబోలో ఛాన్స్ కొట్టేసింది. ఇప్పుడు ఇంకా మరిన్ని ప్రాజెక్టులు టాలీవుడ్ నుంచి రానున్నాయి అనే టాక్ కూడా ఉంది. అయితే ఆమె తెలుగులో ఒక్క సినిమా కూడా ఇంకా రిలీజ్ కాకుండానే.. ఆఫర్స్ క్యూ కట్టడంపై సంతోషం వ్యక్తం చేస్తోంది. అయితే శ్రీదేవి కుమార్తె టాలీవుడ్ కి రావాలి అని ప్రేక్షకులు ఎప్పటి నుంచో అనుకుంటున్నారు. వారి కోరికను తీరుస్తూ దేవరతో సెప్టెంబర్ 27న జాన్వీ కపూర్ తారక్ సరసన కనిపించబోతోంది. ఇప్పుడు ఈ మూవీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. "దేవర సినిమాలో నా పాత్ర సెకండాఫ్ లోనే ఎక్కువ ఉంటుంది. నేను జూనియర్ ఎన్టీఆర్ తో ఒక సాంగ్ చేశాను. నెక్స్ట్ సాంగ్ షూట్ కోసం వెయిట్ చేస్తున్నాను. నాకు జూనియర్ ఎన్టీఆర్ తో డ్యాన్స్ చేయాలని ఉంది అంటూ చెప్పుకొచ్చింది" జాన్వీ కపూర్. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఈ మూవీలో జాన్వీ కపూర్ పాత్ర నెగిటివ్ రోల్ అయ్యే అవకాశం ఉందని అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. దేవర మూవీ షూటింగ్ దాదాపుగా పూర్తైనట్లు చెబుతున్నారు. ఇంకా కాస్త షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది. ఈ మూవీ రిలీజ్ కాకుండానే.. ఆర్సీ 16లో జాన్వీ కపూర్ ఛాన్స్ కొట్టేసింది. ఆ మూవీ కూడా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లబోతోంది అని టాలీవుడ్ లో టాక్ నడుస్తోంది.



# పుష్ప2 మూవీ అప్ డేట్స్

**విశ్వంభర, సినిమా :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప ది రైజ్ చిత్రంతో దేశ వ్యాప్తంగా సూపర్ క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ఈ చిత్రంలో తన నటనకు గానూ బన్నీ నేషనల్ అవార్డును అందుకున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన సీక్వెల్ పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 6, 2024 న వరల్డ్ వైడ్ గా థియేటర్లలో రిలీజ్ కి రెడీ అవుతోంది. స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ బడ్జెట్ మూవీలో రష్మిక మందన్న ఫీమేల్ లీడ్ రోల్ లో నటిస్తుంది. ఈ చిత్రం ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. అయితే రేపటి నుండి ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనుంది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. బన్నీ త్వరలో షూటింగ్ లో జాయిన్ కానున్నారు. మలయాళ స్టార్ నటుడు ఫహద్ ఫాసిల్, అనసూయ భరద్వాజ్, ధనంజయ, సునీల్, రావు రమేష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ఆడియెన్స్, ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు.




# ఒత్తిడిని దూరం చేసే 'మమ్స్ అన్‌ప్లగ్డ్'




**విశ్వంభర, ఫీచర్:** తల్లుల్లో మానసిక ఆరోగ్యం, శ్రేయస్సును పెంపొందించడానికి ఉద్దేశించిన "మమ్స్ అన్‌ప్లగ్డ్" అనే కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ రష్మీ(ల్యాండ్‌మార్క్ వరల్డ్‌వైడ్).. ఎన్జీవో మర్హామ్ రెసొనేటింగ్ రెసిలెన్స్, టోటల్ సొల్యూషన్స్ రిహాబిలిటేషన్ సొసైటీ, టాక్ అండ్ లెర్న్ థెరపీ సెంటర్, నయాదిశాతో కలిసి హైదరాబాద్ లో నిర్వహించింది. ఈ కార్యక్రమం అధిక ఒత్తిడి, నిరాశ, ఆందోళన, ఇతర మానసిక ఇబ్బందుల వంటి సవాళ్ల మధ్య మాతృమూర్తులు తమ కుటుంబాలలో పోషించే కీలక పాత్రను గుర్తించి, అవసరమైన మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించింది. ప్రభావవంతమైన తల్లులు,మాతాశిశు ఆరోగ్యంలో నిపుణులతో సహా 100 మందికి పైగా పాల్గొన్న ప్రారంభ కార్యక్రమానికి పద్మశ్రీ డా. మంజుల అనగాని, ఆర్జే షెజ్జి వంటి ప్రముఖులు కూడా హాజరయ్యారు. ఎన్జీవో మర్హాం వ్యవస్థాపకులు డాక్టర్. నబత్ లఖానీ, చైల్డ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ నిత్య, సైకియాట్రిస్ట్‌లు, పీడియాట్రిషియన్‌లు, గైనకాలజిస్ట్‌లు, సైకాలజిస్టులు, థెరపిస్టుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంది. "జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎందుర్కొంటూ ముందుకెళ్లడానికి అవసరమైన సాధనాలతో తల్లులను శక్తివంతం చేయడం 'మమ్స్ అన్‌ప్లగ్డ్' చొవరతో మా లక్ష్యం" అని డాక్టర్ నిత్య అన్నారు. ఈ ఈవెంట్‌లో మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై ఆయా రంగాలలో నిపుణులతో చర్చగోష్టి కార్యకలాపాలు జరిగాయి. టోటల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు, సైకాలజిస్ట్ అయిన డాక్టర్ పూజా ఝా మాట్లాడుతూ.. "ఒంటరి తల్లులు, న్యూరోటైపికల్, న్యూరోడైవర్జెంట్ పిల్లలు ఉన్న తల్లులు తమ అనుభవాలను పంచుకోవడానికి అలాగే, ఒకరికొకరు మద్దతు ఇచ్చుకోవడాన్ని మేము స్వాగతిస్తున్నాము" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా ఆశా హాస్పిటల్, రెయిన్‌బో హాస్పిటల్ కన్సల్టెంట్ పెరినాటల్ సైకియాట్రిస్ట్, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీలో ఉమెన్ అండ్ పెరినాటల్ మెంటల్ హెల్త్ కమిటీ సహ ఛైర్‌పర్సన్ డాక్టర్ శ్వేతారెడ్డి ఎస్, సైకియాట్రిస్ట్, డెవలప్‌మెంటల్ పీడియాట్రిషియన్ డాక్టర్ రవికాంత్, డాక్టర్ ప్రతిమ గిరి, డాక్టర్ సనా స్మృతి కూడా తమ నైపుణ్యాలను పంచుకొని చర్చలను మరింత మెరుగుపరచడానికి దోహదం చేశారు.

# ఉసిరి.. ఆరోగ్య సిరి

**విశ్వంభర, ఫీచర్ :**

ఉసిరి....భారతీయ జీవన విధానంలో ఒక భాగం. ఇది ఆరోగ్య ప్రదాయని అని పూర్వీకులు ఏనాడో గుర్తించారు. హిందువుల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారంతో విడదీయరాని బంధం ఉన్న చెట్టు. సంప్రదాయరీతిలో పూజించడమే కాకుండా ఉసిరితో ఆవకాయ పెట్టుకోవడం చాలామందికి అలవాటు. చలికాలంలో ఉసిరికాయ ముద్దను ఒంటికి రాసుకుని స్నానం చేయడం కూడా అందరికీ తెలిసిందే.కార్తీక మాసంలో ఉసిరి చెట్ల కిందే వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడం ఒక ఆనవాయితీగా వస్తోంది. ఈ అన్నింటికి కారణం ఉసిరిలో ఎన్నో ఔషధగుణాలు ఉండటమే. అందుకనే ప్రతి ఇంటిలో ఒక ఉసిరి చెట్టును పెంచాలని శాస్త్రజ్ఞులు చెప్తుంటారు. మరి మనకు ఆరోగ్య సిరిని అందించే ఉసిరి గురించి తెలుసుకుందామా? ఉసిరి కాయలో ఎన్నో ఔషధగుణాలు దాగున్నాయి. అందుకే దీనిని విటమిన్ సి పవర్ హౌస్‌గా పరిగణిస్తారు. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు, క్యాన్సర్ నిరోధక లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. అనేక వ్యాధులను నయం చేయడానికి ఎక్కువగా ఆయుర్వేదంలో ఉసిరిని వినియోగిస్తారు. ఉసిరి రుచి పుల్లగా వగరుగా ఉన్నప్పటికీ.. ఇది అద్భుతమైనదని తప్పనిసరిగా తినాలని వైద్య నిపుణులు చెబుతుంటారు. రోజూ ఒక ఉసిరికాయ తినడం వల్ల అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చంటున్నారు. ఉసిరికాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జలుబు, జ్వరం, ఫ్లూ వంటి చిన్న వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది.



ఇది గాయాలను నయం చేయడంలో కూడా సహాయపడుతుంది. రోజూ ఒక ఉసిరికాయ తినడం వల్ల మన శారీరక, మానసిక ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి.. పరగడుపున దీనిని తీసుకుంటే మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చు. ఉసిరిలో ఉండే అధిక ఫైబర్ సరైన జీర్ణక్రియను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇంకా మలబద్ధకం సమస్యను దూరం చేసి పొట్టను శుభ్రంగా ఉంచుతుంది. ఉసిరిలో విటమిన్ ఎ కూడా పుష్కలంగా లభిస్తుంది. ఇది కళ్ళకు చాలా ముఖ్యమైనది. ఉసిరికాయను రోజూ తినడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది.. కంటిశుక్లం వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఉసిరికాయ జుట్టుకు కూడా చాలా మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు జుట్టుకు పోషణనిచ్చి అవి రాలిపోకుండా చేస్తాయి. అంతేకాకుండా, ఇది జుట్టును ఒత్తుగా, బలంగా, మెరిసేలా చేస్తుంది. ఆమ్లా.. కొవ్వును కరిగించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. జీవక్రియను పెంచుతుంది. ఇందులోని పీచు మీకు త్వరగా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది.. మీరు తక్కువ తినేలా చేస్తుంది.. ఫలితంగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఉసిరికాయను అనేక రకాలుగా తినవచ్చు. పచ్చిగా తినవచ్చు. లేదా జామ్, చట్నీ లేదా జ్యూస్ తయారు చేసుకొని తీసుకోవచ్చు.. అధిక ప్రయోజనాల కోసం పచ్చి ఉసిరి తినడం ఉత్తమమైనదిగా చెబుతారు. ఈ సమాచారం కేవలం మీ అవగాహన కోసం మాత్రమే.. వీటిని ఉపయోగించే ముందు సంబంధిత నిపుణులను సంప్రదించడం మంచిది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com